జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 17 పక్షపత్రిక సెప్టెంబర్ 1-15, 2012


















## సురాజ్య ఉద్యమ ప్రచార భేరి


సుపరిపాలన కోసం - అందరికీ ఎదిగే అవకాశాల కోసం
సురాజ్యఉద్యమం
డి.వి.వి.యస్. వర్మ


మెరుగైన సమాజం కోసం
సురాజ్య ఉద్యమం
సురాజ్యం నిర్మిద్దాం
డా॥ జయప్రకాష్ నారాయణ్


సురాజ్య ఉద్యమం
అవినీతిపరుల ఆటకట్టించే
కొత్త లోకాయుక్త చట్టం
డా॥ జయప్రకాష్ నారాయణ్

# సురాజ్య ఉద్యమం




నంద్యాలలో



గుంతకల్లులో



హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో



రాజమండ్రిలో



చిలకలూరిపేటలో



రాయదుర్గంలో




నరసరావుపేటలో



రాష్ట్ర కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక సెప్టెంబర్ 1-15, 2012

సంపుటి - 3 సంచిక - 17

## లోపలి పేజీల్లో...

సురాజ్య ఉద్యమానికి స్టీరింగ్ కమిటీ ............ 5

లోక్‌సత్తా సురాజ్య ఉద్యమం....................... 6

సురాజ్య ఉద్యమం కొన్ని ముఖ్య లక్ష్యాలు......... 7

స్వచ్ఛమైన రాజకీయాలు సాధ్యమే................ 8

దేశ భవిత యువతరం............................. 9

దేశం కోసం యువత రాజకీయాల్లోకి రావాలి... 10

రాజనీతి, జనహితం రెండూ వేరువేరు కాదు..... 14

లక్ష్య సాధనాలుగా నగదు బదిలీలు................16

సమీక్షణాత్మక గ్రంథం................................19

సురాజ్య ఉద్యమం కొన్ని నినాదాలు.............. 20

సురాజ్య ఉద్యమ పాటలు.......................... 21

పట్టణాలలో సురాజ్య ఉద్యమ నగారా............. 22

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**

జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**
డి.టి.పి : **జ్యోతి తాటి**
ఫొటోలు : **ఎన్. సంజీవ్ కుమార్**

# విద్యుత్ సంక్షోభాన్ని నివారించాలి

## సంపాదకీయం

ఆధునిక ప్రపంచానికి ప్రస్తుత విద్యుత్ శక్తే ప్రాణ వాయువుగా వుంది. విద్యుత్ లేకుండా ఒక నిముషం నడవదు. జన జీవనం స్తంభిస్తుంది. పరిశ్రమలు మూతపడతాయి. వ్యవసాయం ఆగిపోతుంది. పంటలు ఎండిపోతాయి. ఇవి అర్థం కావడానికి నిపుణులు అక్కరలేదు. అందరికీ తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి ఇదే. దీనికి తోడు విద్యుత్ వినియోగం రోజు రోజుకీ పెరుగుతుంది. దానికి తగ్గ ప్రణాళికలు లేకపోతే పరిస్థితి విషమిస్తుంది.

ఒక పక్క వర్షాలు లేక జలవిద్యుత్ తగ్గిపోయింది. మరోపక్క బొగ్గు కొరత. ఇంకో పక్క గ్యాస్ కొరత. అన్నీ ఒక్కసారి రావడంతో ఆంధ్రప్రదేశ్ అంధకార ప్రదేశ్‌గా మారింది. నిజానికి ఆంధ్రప్రదేశ్‌లో ఈ సహజవనరులు అపారంగా వున్నాయి. కాని ఎప్పుడు విద్యుత్ కొరతతోనే సతమతమౌతున్నది.

సౌర విద్యుత్ కారుచౌకగా వచ్చేవరకూ థర్మల్ పవర్ మీదా, అణువిద్యుత్ మీదా ఆధారపడకతప్పదు. ఇతర సంప్రదాయేతర విద్యుత్‌ల మీద ఆశలు పెట్టుకున్నా అవి సరిపోయేవి కాదు. భరించలేని భారం అయ్యే స్థితి వుంది. పైగా దేశంలో ఎక్కడా విద్యుత్ మిగులు ఇప్పడు లేదు. కొనడానికి కూడా దొరికే స్థితి లేకుండా పోయింది. ఇదో విపత్కర పరిస్థితి. దీనిపై రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. చిన్న పరిశ్రమలు కుదేలు కావడంతో వారు రోడ్డెక్కుతున్నారు. 6 నుండి 12 గంటల విద్యుత్ కోతలు జన జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వీరికి మద్దతుగా ప్రతిపక్షాలన్నీ ఆందోళన బాట పట్టాయి. రాస్తారోకోలు, బందులు, ముట్టడులు నిత్యకృత్యాలయ్యాయి. ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో పొంతన లేని ప్రకటనలు చేస్తున్నది.

దీనికి తాత్కాలిక పరిష్కారాలు, శాశ్వత పరిష్కారాలు చూపే ప్రయత్నాలు ప్రారంభించాలి. అందుకు ప్రభుత్వం, పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు అందరూ ముందుకు రావాలి. ఒకపక్క జల విద్యుత్ కోసం కర్నాటక ప్రభుత్వాన్ని ఒప్పించి కొంత నీటి విడుదలకు ప్రయత్నాలు తక్షణం చెయ్యాలి. మరో పక్క బొగ్గు, గ్యాస్ కేటాయింపులు జరిపించే ఏర్పాట్లు చెయ్యాలి. కేంద్రం చొరవ తీసుకుని ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకునేలా ఇలాంటి చర్యలకు తోడ్పాటునివ్వాలి.

ఒక సమస్య దీర్ఘకాలికమైంది. దీని పరిష్కారానికి పార్టీలకు అతీతంగా సమిష్టి ప్రయత్నం వెంటనే జరగాలి.

థర్మల్ ప్రాజెక్టులు, అణువిద్యుత్ కేంద్రాల ప్రారంభంపై ఎక్కడికక్కడ ప్రజల్ని రెచ్చగొట్టే ధోరణి విడనాడి అమలైన ప్రదేశాల ఎంపిక, పర్యావరణ పరిరక్షణ, ప్రమాదరహితంగా వీటిని సాధ్యం చేసుకునే విధంగా ఏకాభిప్రాయాన్ని సాధించాలి. నిర్వాసితులకు ఆమోదయోగ్యంగా వుండే విధంగా ఏకాభిప్రాయాల్ని సాధించాలి. ఇవాళ ప్రతిపక్షాలు, రేపు అధికార పక్షాలైనా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. అందువల్ల అందరూ విజ్ఞతతో వ్యవహరించాలి. అలాగే తక్షణం విద్యుత్ ఉత్పత్తికి వీలైన వాటికి ప్రాధాన్యతనిచ్చి రెండు మూడు నెలలలోనే పరిస్థితి కొంత మెరుగుపడడానికి వీలైన పథకాలను ఆచరణలో పెట్టాలి.

ఇలాంటి విజ్ఞతని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలు, ఇంధనరంగంలో పర్యావరణంపై కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు ప్రదర్శించాలి. తాపట్టిన కుందేటికి మూడే కాళ్లని ఎవరి మంకు పట్టులో వారుంటే ఈ పరిస్థితి కొనసాగింపుకు అందరూ బాధ్యులు అవుతారు. ■




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034

**ఫోన్ నంబర్లు :**
**040- 23311817, 23311819, 23311820, 23312829**
**ఫ్యాక్స్ : 040-23310612**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# సురాజ్య ఉద్యమానికి రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ

## ప్రతి పట్టణానికీ సురాజ్య ఉద్యమం



సురాజ్య ఉద్యమాన్ని పార్టీల కతీతంగా ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటైంది. ఇందుకోసం వివిధ రాజకీయ పార్టీల నేతలు, పౌరసమాజ సంస్థల ప్రతినిధులు ఆగస్టు 23న ఫ్యాప్సీహాల్‌లో సమావేశమయ్యారు.

లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్ మీడియాకు వివరిస్తూ... అందరికీ స్థూలంగా ఏకాభిప్రాయం వున్న కొన్ని మౌలికాంశాలను వ్యవస్థీకృతంగా సాధించి, ప్రజలలో వ్యాపించివున్న నిరాశనిస్పృహల్ని పారదోలి విశ్వాసాన్ని పాదుకొలపటమే ఈ సురాజ్య ఉద్యమ మౌలికలక్ష్యమని తెలిపారు.

పౌరసేవల్ని ఒక హక్కుగా అందించేలా, అధికారాన్ని వికేంద్రీకరించి జనం చేతికి ఇచ్చేలా, అవినీతిరహిత పాలనను అందించేలా, ఎన్నికల సంస్కరణల ద్వారా నైతిక రాజకీయాలను అందించేలా ప్రభుత్వం మీద, రాజకీయ పార్టీల మీద ఒత్తిడిని పెంచేలా ప్రజలలో చైతన్యాన్ని, అవగాహనను పెంచటం సురాజ్య ఉద్యమ తొలిదశ లక్ష్యమని జేపీ చెప్పారు.

ప్రతి పట్టణంలో రౌండ్‌టేబుల్ సమావేశాలను ఏర్పాటుచేయటం, కళాశాలలో చర్చావేదికల్ని ఏర్పాటు చేయటం, వలంటీర్లకు శిక్షణనివ్వటం, సాహిత్యాన్ని ప్రచురించి అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం, డిసెంబర్ 9లోగా కనీసం కోటిమందిని చేరటం సురాజ్య ఉద్యమ తక్షణ లక్ష్యంగా పెట్టుకున్నామని జేపీ పేర్కొన్నారు.

సురాజ్య ఉద్యమాన్ని అన్నివర్గాల ప్రజలలోకి తీసుకెళ్లేందుకు సురాజ్య ఉద్యమ రాష్ట్ర స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

### సురాజ్య ఉద్యమ రాష్ట్రస్టీరింగ్ కమిటీ

ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ (ఎం.ఎల్.సి), చెన్నమనేని రాజేశ్వరరావు (టీడీపీ), చుక్కా రామయ్య (ఎం.ఎల్.సి), ఎం.కోదండరెడ్డి (కాంగ్రెస్), పద్మనాభరెడ్డి, సోలిపేట రామచంద్రారెడ్డి, కాకి మాధవరావు, కె. శ్రీనివాసరెడ్డి (ఐ.జె.యు), డి. సోమసుందర్ (ఎ.పి.యు.డబ్ల్యు.జె), చెలికాని రావు, రామకృష్ణం రాజు (ఎన్.ఎ.పి.ఎం), టి.ఎల్. నరసింహారావు (లోక్‌సత్తా), ఎస్.ఎస్ రాజమౌళి, తమ్మారెడ్డి భరద్వాజ, కె. పద్మనాభయ్య, డి.వి.వి.ఎస్ వర్మ, లక్ష్మణ్ రెడ్డి, శ్రీమతి జి. ప్రతిభారావు, శ్రీమతి సత్యవాణి, మజీర్ హుస్సేన్, కార్తీక్ చంద్ర, పద్మ భూపతిరాజు, డా॥ జయప్రకాష్ నారాయణ్ (కన్వీనర్).

సలహాదారులలో కె. రామచంద్రమూర్తి (హెచ్ఎంటీవీ, ది హన్స్ ఇండియా), తెలకపల్లి రవి (రచయిత, సీనియర్ పాత్రికేయులు) ఉన్నారు.

★ వివిధ పార్టీల ప్రతినిధులతోనూ, ఆసక్తి గల ప్రముఖులతోనూ సంప్రదించి సురాజ్య ఉద్యమ కమిటీని అందరి భాగస్వామ్యం ఉండేలా మరింత విస్తృత పరుస్తామని జేపీ ప్రకటించారు

# లోక్‌సత్తా సురాజ్య ఉద్యమం

## అక్టోబర్ 2 వరకు నిర్వహించాల్సిన కార్యక్రమాలు

సురాజ్య ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా విశాల ప్రాతిపదికన నిర్వహింపజెయ్యాలి. ఈ ఉద్యమం ద్వారా ప్రముఖుల్ని, మేధావుల్ని, మధ్యతరగతి వర్గాలతోపాటు, విద్యార్థుల్ని, యువతనీ, స్వచ్ఛంద సంస్థలనీ, గ్రామీణ ప్రజల్ని, రైతుల్ని గట్టి ప్రయత్నం జరగాలి.

**1. రౌండ్‌టేబుల్ సమావేశాలు :** ప్రతి పట్టణంలో ముందుగా ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని, – పురప్రముఖులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించాలి. సురాజ్య ఉద్యమ లక్ష్యాలను పరిచయం చేసి అందరితో మాట్లాడించాలి.

ఈ సమావేశంలోనే ఒక తాత్కాలిక సన్నాహక సంఘాన్ని ఏర్పాటు చెయించాలి. ప్రతి విద్యా సంస్థ తన ఆధ్వర్యంలో విద్యార్థులకు చర్చాగోష్టులను, ప్రతి స్వచ్ఛంద సంస్థ తన సభ్యుల సమావేశంలో ఒక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించే విధంగా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్ణయింప జెయ్యాలి.

**2. వివిధ సంస్థలలో చర్చాగోష్ఠులు :** ఆగస్టు–సెప్టెంబరు నెలలో విద్యాసంస్థలలో, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కనీసం 10 చర్చా కార్యక్రమాలు నిర్వహింప జెయ్యాలి. వీటితో పాటు కళాశాలల లెక్చరర్లతో హైస్కూలు– ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో డాక్టర్లు, లాయర్లతో ప్రత్యేక రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహింప జెయ్యాలి.

**3. వలంటీర్ల నమోదు :** ఈ చర్చా కార్యక్రమాలన్నింటిలోను వలంటీర్ల నమోదు విధిగా జరిపించాలి. విద్యార్థులలో హెచ్చు సంఖ్యలో వలంటీర్ల నమోదుకు వీలుగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలి. మొత్తం మీద పట్టణంలో కనీసం 100 మంది వలంటీర్లను నమోదు చేయించాలి.

**4. వలంటీర్లకు శిక్షణ :** నమోదు చేసుకున్న వలంటీర్లకు విధిగా ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించాలి.

**5. ప్రజా ఛార్జిషీట్లు :** స్థానికంగా ఆఫీసుల్లోను వివిధ పథకాలలో వున్న అవినీతిని వెలికితీసి, తగిన ఆధారాలు సేకరించి ఒక ప్రజా ఛార్జిషీటును రూపొందించడానికి తగిన బృందాన్ని ఏర్పాటు చెయ్యాలి. ఈ ప్రజాఛార్జిషీటును, సంబంధింత అధికారులకు ఇవ్వాలి. పత్రికలకు విడుదల చెయ్యాలి. అవినీతికి గురైన బాధితులతో మాట్లాడించాలి. బాధితులు సామూహికంగా ముందుకు వచ్చే చోట తగిన ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాలి. పట్టణంలో కనీసం 4 ఛార్జిషీట్లు ప్రకటింపజెయ్యాలి. ఆఫీసులలో అవినీతి, పథకాలలో అవినీతి మీద ప్రజా బ్యాలట్‌లు నిర్వహించి, ఫలితాలు ప్రకటింపజెయ్యాలి.

అవినీతికి సంబంధం లేకుండా కేవలం ప్రజాసమస్యలకు సంబంధించిన అంశాలయితే వాటిని వినతిపత్రాల రూపంలో అధికారులకు అందజేసి ఫలితాలు రాబట్టడానికి ప్రయత్నించాలి.

**6) సురాజ్య ఉద్యమ కమిటీ :** ఈ కార్యకలాపాలలో కలిసి వచ్చిన అన్ని విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, పురప్రముఖులతో విస్తృత స్థాయిలో సురాజ్యఉద్యమ కమిటీని ఏర్పాటు చెయ్యాలి. రోజువారీ కార్యక్రమాల నిర్వహణకు ఒక సారధ్య సంఘాన్ని ఏర్పాటు చెయ్యాలి. ఈ కమిటీకి సారధులుగా పురప్రముఖుల్ని, లోక్‌సత్తా ఉద్యమసంస్థ ప్రతినిధుల్ని ముందుంచాలి.

**7) అక్టోబర్ 2 గాంధీ జయంతి కార్యక్రమాలు**

అన్ని విద్యాసంస్థలలో సామూహికంగా జాతీయ గీతాలాపన, ప్రతిజ్ఞ, కార్యక్రమాలు నిర్వహించాలి. అక్టోబర్ 2 శెలవు అయితే అక్టోబరు 1వ తేదీన ఈ కార్యక్రమం నిర్వహించాలి. అక్టోబర్ 2న పట్టణంలో వందలాది మందితో సామూహిక సత్యాగ్రహ కార్యక్రమం సాగించాలి. (నిరాహార దీక్ష కాదు) ఉదయం 11 నుండి సా॥ 4 గంటల వరకు దీనిని సాగించాలి. అందరితోనూ మాట్లాడించాలి.

**8) సురాజ్య ఉద్యమనిధి**

సురాజ్య ఉద్యమనిధి సేకరణకు ఏర్పాట్లు చేసుకోవాలి. స్థానికంగా చేపట్టే కార్యకలాపాలకు ఈ నిధులను వినియోగించుకోవాలి. జమాఖర్చులు పారదర్శకంగా వుండేలా ఒక బాధ్యుణ్ణి నియమించుకోవాలి. దీనిపై లోక్‌సత్తా తెలియజేసే మార్గదర్శకాలను పాటించాలి.

ఇవీ అక్టోబర్ 2 వరకూ సాగించాల్సిన సురాజ్యఉద్యమ కార్యక్రమాలు. ■

# సురాజ్య ఉద్యమం కొన్ని ముఖ్య లక్ష్యాలు

**I సురాజ్యం : అందరికీ ఎదిగే అవకాశాల కోసం**

సుపరిపాలన కోసం సురాజ్యం ఉద్యమం. సుపరిపాలన అంటే...

ఎ) పుట్టిన ప్రతి బిడ్డకీ, డబ్బుతో, కులంతో, పేదరికంతో నిమిత్తం లేకుండా మంచి ప్రమాణాల విద్యతో ఎదిగే అవకాశాలు కల్పించడం.

బి) డబ్బు కారణంగా తగిన వైద్యం అందక ఏ వ్యక్తి మరణించకూడదు కుటుంబాలు అప్పుల పాలు కాకూడదు.

సి. యువతకు చదువుకు తగ్గ ఉపాధి, ఉపాధికి తగిన నైపుణ్యాలతో ఎదిగే అవకాశాలు కల్పించాలి. నిరుద్యోగ భృతికి చేతులు చాపే యాచకులు కాకుండా వారిని సంపాదనా పరుల్ని చెయ్యాలి.

డి) వ్యవసాయం లాభసాటి వృత్తి కావాలి. రాయితీల చుట్టూ కాకుండా లాభసాటి ధరల చుట్టూ తిరిగే ఏర్పాట్లు చెయ్యాలి.

ఇ) పేదలకు, చేతివృత్తులకీ జీవనభద్రత కల్పించాలి.

**II సురాజ్యం : మన ఊళ్ళో మంచి వసతుల కోసం**

పజలు నివసించే చోట పాలన వుండాలి. పంచాయితీలు, మున్సిపాలిటీలు స్థానిక ప్రభుత్వాలు కావాలి. అందరికీ గృహవసతి, శుద్ధి చేసిన మంచినీరు, ఈగలు, దోమలు లేని పారిశుధ్యం, 24 గంటలు గృహ విద్యుత్ వుండాలి. చదువులు చెప్పే పాఠశాలలు, వైద్యసేవలు అందించే ఆరోగ్య కేంద్రాలు, యువతకి ఉపాధి శిక్షణ, రైతులకి వ్యవసాయ విజ్ఞానం ఎక్కడ కక్కడే అందుబాటు కావాలి.

**III సురాజ్యం: లంచాలు లేని ప్రభుత్వ సేవల కోసం**

లంచాలు, సిఫారసులు లేకుండా నిర్దిష్ట గడువులోగా ప్రభుత్వ కార్యాలయాలలో సేవలని ప్రజలు హక్కులుగా పొందాలి. పౌరసేవల హక్కు చట్టం తేవాలి.

**IV సురాజ్యం : అవినీతిరహిత పాలన కోసం**

అవినీతిపరుల భరతం పట్టగల అధికారాలతో కోరలు గల కొత్త లోకాయుక్త చట్టం రావాలి.

**V సురాజ్యం : కొత్త తరహా ఎన్నికల వ్యవస్థ కోసం**

ప్రతి ఓటుకీ ప్రాతినిధ్యం కల్పించడానికి, డబ్బు మద్యం ప్రభావం తగ్గించడానికి దామాషాపద్ధతి ఎన్నికల వ్యవస్థ రావాలి.

## సురాజ్య ఉద్యమ ప్రతిజ్ఞ




*సురాజ్యం కోసం సాగిస్తున్న*
*మరో స్వతంత్ర పోరాటంలో*
*నేను భాగస్వామిగా ఉంటాను*
*స్వతంత్ర సమరయోధుల త్యాగఫలాన్ని*
*రాజ్యాంగ విలువలని రక్షించుకోవడం కోసం,*
*అవినీతిని అంతం చేయడం కోసం*
*నా సర్వశక్తుల్ని ఒడ్డుతాను*
*కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా*
*దేశ ఐక్యతని, సమగ్రతని నిరంతరం కాపాడుతాను*
*దేశ నిర్మాణ కార్యక్రమంలో నేను విధిగా పాల్గొంటాను*
*ప్రజాస్వామ్యంలో సురాజ్యం నా జన్మహక్కు*
*దానిని సాధించడం నా విధిగా భావించి*
*ఈ ప్రతిజ్ఞ చేస్తున్నాను*

# స్వచ్ఛమైన రాజకీయాలు సాధ్యమే
# ... గెలవటానికి అవినీతో, తాయిలాలో అక్కర్లేదు

**- కె.జె అల్ఫాన్స్**

రాజకీయాలంటే కుళ్లు అని మనదేశంలో చాలామంది నమ్ముతుంటారు. గత 33ఏళ్లకుపైగా నేను 20లక్షలమందికి పైగా విద్యార్థులతో మాట్లాడాను. ఒక ప్రశ్నను మాత్రం నిరంతరం అడుగుతుండేవాడిని: "రాజకీయ నాయకులు కావాలని మీలో ఎంతమంది అనుకుంటున్నారు?". సమాధానం ఎప్పుడూ ఒకటే వచ్చేది: "మేం రాజకీయాల్ని అసహ్యించుకుంటున్నాం". మనకు స్వచ్ఛమైన రాజకీయనేతలు కొంతమంది ఉన్నారనటంలో సందేహం లేదు. అయితే ఆ నిష్కల్మష విద్యార్థి హృదయాలలో వారు మార్పు తేలేకపోతున్నారని నా భావన.

అయితే 2006లో ఓ అనూహ్యమైన పరిణామం జరిగింది. కేరళ ఎన్నికలకు కేవలం 45రోజుల ముందు వామపక్షాల నుంచి ఒక తెలిసిన రాజకీయవేత్త నన్ను అడిగారు: "వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో మీ సొంత నియోజకవర్గం కంజీరప్పల్లి నుంచి మేం సీటు ఇస్తే పోటీచేస్తారా? మీరు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయవచ్చు. వామపక్షాలు మీకు మద్దతిస్తాయి".

నా కలల్ని సాకారం చేసుకునేందుకు నడుంబిగించాను. నా ఆఫీసు సౌకర్యాల్ని విడిచిపెట్టి నా స్వగ్రామానికి రైలులో ద్వితీయశ్రేణి కోచ్‌లో బయల్దేరాను. నాకు స్వాగతం పలికేందుకు కిక్కిరిసిన జనసందోహం వుంటుందని ప్రయాణంలో ఊహించుకున్నాను. అది నా నగరం. అక్కడ దాదాపు 15 ఏళ్ల క్రితం నేను జిల్లా కలెక్టర్‌గా పనిచేశాను. కానీ కొట్టాయం రైల్వేస్టేషన్ వద్ద నన్ను రిసీవ్ చేసుకోవటానికి రైల్వే కూలీలు తప్ప ఎవరూ లేరు.

నేను డిపాజిట్ కూడా కోల్పోతానని చాలామంది జోస్యం చెప్పారు, స్థానిక నాయకులుగా గుర్తింపు పొందిన ఇద్దరు వామపక్ష తిరుగుబాటు అభ్యర్థులు కూడా బరిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఒక అనుభవజ్ఞుడైన నాయకుడు నాకు ప్రత్యర్థిగా ఉన్నారు. పైగా కాంగ్రెస్‌కు కంచుకోటగా పేరొందిన నియోజకవర్గమిది.

కొన్ని మౌలిక అంశాలు, సూత్రాల మీదే నేను ప్రచారం సాగించాను: నియోజకవర్గం నుంచి ఎటువంటి డబ్బునూ వసూలు చేయను. ఓటరుకు ఎటువంటి డబ్బు ఇవ్వను. మద్యం పంచను. ప్రత్యర్థి మీద వ్యక్తిగత దూషణలు, నిందారోపణలు ఉండవు. నేను జిల్లా కలెక్టర్‌గా వున్నప్పుడు ప్రజల కోసం చేసిన కృషినే నమ్ముకుని, దాని మీదే ప్రధానంగా ప్రచారాన్ని కేంద్రీకరించాను.

నేను రాజీనామా చేసిన 32వ రోజున ఎన్నిక జరిగింది. సుమారు 12,000 ఓట్ల మెజారిటీతో గెలిచాను. ఇది కేరళలోని అత్యధిక మెజారిటీలలో ఒకటి. మొత్తం ఎన్నికల ప్రచారానికి



రూ.10లక్షలలోపే ఖర్చు చేశాను. ఒక్క చుక్క మద్యం కూడా పంచలేదు. నా ప్రత్యర్థి నాకు మంచి మిత్రుడుగానే ఉన్నారు.

నేను అక్కడితో ఆగిపోలేదు. అది కేవలం ప్రారంభం మాత్రమే. ఒక ఎమ్మెల్యే కూడా నిజాయతీగా, స్వచ్ఛంగా ఉండగలగడని నిరూపించదలుచుకున్నాను. భిన్నమైన మార్గంలో వెళ్లాలని నిర్ణయించుకున్నాను. అందుకోసం రెండు మౌలికమైన బాధ్యతల్ని ఎంచుకున్నాను: అసెంబ్లీలో ప్రజలకు గొంతునివ్వటం, నియోజకవర్గానికి అభివృద్ధిని తీసుకురావటం.

నాలుగున్నరేళ్ల కాలంలో, నా నియోజకవర్గానికి రూ.350కోట్లు తీసుకొచ్చాను. కేవలం మాకు డబ్బు తెచ్చుకోవటమేకాదు, పనులు చేసి చూపించాం. అనుకున్న సమయానికి ముందుగానే ప్రతి ప్రాజెక్టునూ పూర్తిచేశాను. 2011 అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేయటానికి వామపక్షాల ఎన్నికల కమిటీ ద్వారా తిరిగి నామినేట్ అయిన తొలి వ్యక్తిని నేను. నేను ఎన్నికలలో పోటీచేయనని ఆ మరుసటి రోజే ప్రకటించాను. సగం భారతదేశం ఆకలితో అలమటిస్తుంటే, కేరళలోని అత్యంత సంపన్నమైన నియోజకవర్గం నుంచి నేను ఎమ్మెల్యేగా ఎన్నికవనని చెప్పాను. ఎవరైనా అవకాశమిస్తే, జాతీయరాజకీయాలలోకి వెళ్లాలనుకుంటున్నట్టు చెప్పాను. నితిన్ గడ్కరీ నన్ను పిలిచారు. బీజేపీలో చేరాను. నాకున్న ఎజెండా చిన్నదే: ప్రతి వ్యక్తికీ కడుపునిండా తిండి ఉండాలి. ప్రతి బిడ్డా పాఠశాలకు వెళ్లాలి. కష్టపడగలిగే ప్రతి వ్యక్తికీ చేతినిండా పని ఉండాలి.

ఎవరైనా రాజకీయాలలో చేరాలనుకుంటున్నారా? అని ఇటీవల కంజీరప్పల్లిలోని స్కూలు విద్యార్థులను అడిగినప్పుడు దాదాపు 100 చేతులు పైకి లేచాయి. ఇది భారత ప్రజాస్వామ్యానికి శుభవార్తే.

జాతీయ రాజకీయాలకు కంజీరప్పల్లి చెబుతున్న పాఠాలేమిటి? చాలానే ఉన్నాయి. కొన్ని చెబుతాను. మంచి రాజకీయాలు సాధ్యమే. రాజకీయాల నుంచి నేను ఒక్క రూపాయి కూడా సంపాదించలేదు. మీరు మంచిపనులు చేసి ఉంటే, ఎన్నికలలో పోటీచేయటానికి డబ్బు వెదజల్లాల్సిన పనిలేదు. మంచిపనిని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. సంకల్పం ఉంటే ఎమ్మెల్యే గానీ, ఎంపీగానీ తన నియోజకవర్గంలో అద్భుతాలు చేయగలుగుతారు. సరైన పనితీరు కనబరిచే ప్రజాప్రతినిధికి ప్రత్యర్థి పార్టీల నుంచి కూడా మద్దతు వస్తుంది.

ఎన్నికలలో గెలవటానికి మీరు దోపిడీదారుడో, మాఫియా నాయకుడో కానక్కర్లేదు. హుందాతనం, సామర్థ్యం ఉన్నవారు ఎన్నికలలో గెలవగలరు. ■

('టైమ్స్ ఆఫ్ ఇండియా' సౌజన్యంతో)

# దేశ భవిత యువతరం

- ఎ. అరుణ

భవిష్యత్ తరాలకు దిశానిర్దేశం చేయగలవారు చక్కని రాజకీయ వారసులు యువత. రాజకీయాలు అంటే కేవలం ఒక వర్గం ధనవంతులు వారసత్వం గలవారికి మాత్రమే సాధ్యం. అనుకుంటే చాలా పొరబాటు. ఇంతవరకూ పై కారణాల వల్లనే రాజకీయం నడుస్తూ వచ్చింది. ఇప్పుడు ఇకమీదట ఆ రకం మార్గదర్శకత్వం ప్రత్యేకంగా యువత మీదనే ఆధారపడి వుంది. పాత రాజకీయాన్ని సమాధి చేసి కొత్త రాజకీయానికి బాటలు వేయాల్సిన తరుణం వచ్చింది.

నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఐఎన్ఏ) స్థాపించిననాడు ఆయన యువకుడే. అలాగే 'మానవాళికి పనికివచ్చే ఆత్మగౌరవం విశ్వాసం పెంపొందించుకుని, మీ కర్తవ్యాన్ని నిర్వహించండి. అంటూ యువతలో ధైర్యాన్ని ఆత్మ స్థైర్యాన్ని నింపింది యువకుడైన వివేకానందుడే. వీరికి ముందుతరం వారసులైన విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ ఇంకా ఎందరో యువకులు పాలుపంచుకున్నారనే విషయాన్ని గుర్తుతెచ్చుకోండి. ఆ గతమే ఇప్పటి యువకుల కర్తవ్యంగా భావించుకోండి. భారతదేశ పౌరులుగా నిర్వర్తించాల్సిన బాధ్యత ఇప్పటి యువతదే. ఓటు మన ఆయుధం కాబట్టి మొదట ఓటును వినియోగించుకోడానికి హక్కును నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ఎవరికి వారు ఆయా హక్కులను సాధించుకుని మిగిలిన యువతకు

(తరువాయి 13వ పేజీలో)

# దేశం కోసం యువత రాజకీయాల్లోకి రావాల్సిందే.!

- బిరజా మహాపాత్ర

రాజకీయాలు కేవలం పనిలేనివాళ్ళ కోసం మాత్రమే ఉద్దేశించినవా? ఒరిస్సాలో మా హైస్కూళ్ళు, కాలేజీల్లో టీచర్లు మాకు అవుననే చెప్పారు. బాగా చదువుకున్న మనవాళ్ళు కూడా దీనిని ఒప్పుకుంటారు. నిజానికి రాజకీయాలను అసహ్యించుకోవడాన్ని మనం మన నిజాయితీకి కొలబద్దగా చెప్పుకుంటుంటాం. మన తల్లిదండ్రులు కూడా గుడ్డిగా ఇదే అభిప్రాయాన్ని నమ్ముతూ, మన తరంలో మనం రాజకీయాలను ద్వేషించేలా నిరంతరం మనల్ని హెచ్చరిస్తూవచ్చారు.

కానీ, భారత్‌లాంటి ప్రజాస్వామ్యదేశంలో మనం రాజకీయాలను అసహ్యించుకోగలమా? వాటికి దూరంగా వుండగలమా? మన సమాధానం 'అవును' అయితే – నిస్సందేహంగా మనం ఒక అతిపెద్ద నాగరిక సమాజానికి ద్రోహం చేస్తున్నామనే అర్థం. రాజకీయాలను వ్యతిరేకించడమంటే దానిని నేను జాతి వ్యతిరేక నేరంగా భావిస్తాను.

మనం ఒక మంచి రాజ్యాంగాన్ని ఏర్పాటుచేసుకున్నాం, దానినే అంతిమనిర్ణేతగా అంగీకరించామని ఎప్పుడూ మర్చిపోకూడదు. రాజ్యాంగం ప్రకారం దేశపౌరులుగా మనకు ప్రాథమిక హక్కులు, ఆదేశసూత్రాలను సంక్రమించాయి. దీని ప్రకారం మనమందరం దేశ పరిపాలనలో భాగం పంచుకుంటామని నైతికంగా అంగీకరించినట్టే. కానీ, దురదృష్టవశాత్తూ మన దేశంలో ఉపాధ్యాయులు రాజకీయాల్ని ద్వేషిస్తున్నారు; చదువుకున్నవాళ్ళు ద్వేషిస్తున్నారు; ఆఖరికి సామాన్యులు కూడా రాజకీయాలంటే విపరీతమైన విముఖత ప్రదర్శిస్తున్నారు. వాళ్ళు రాజకీయాల్ని 'పని లేని వాళ్ళు చేసే ఉద్యోగం'గా నిర్ణయించేశారు.

అంతేకాదు, జాతికి, తన చుట్టూ వున్న సమాజానికి సేవ చేయాలనే ఆసక్తి వున్న వ్యక్తులు కూడా రాజకీయాల్లో చేరడానికి తిరస్కరిస్తున్నారు. ఫలితంగా ఇప్పటికే రాజకీయాల్లో వున్నవారి వారసులు, నేరచరితులు రాజకీయాల్లో కీలకపాత్రలు పోషిస్తున్నారు. వీరంతా అధికారం మీద తమ పట్టు నిలుపుకోవడం కోసం వేసే ఎత్తులు, జిత్తుల బిజీలో పడిపోయి ప్రజల తమనుంచి ఏం ఆశిస్తున్నారో దానిని మర్చిపోయారు. పెద్దపెద్ద నాయకులకీ ఇదే తంతు. ఫలితంగా ప్రజలమీద శ్రద్ధ లేని నాయకత్వం ఏర్పడిపోయింది. మనం ఓటు వేయడానికి వెళ్ళినప్పుడు ఎవరిని ఎంచుకోవాలో ఛాయిస్ కూడా లేకుండాపోయింది. ఎన్నికలు కూడా బహిరంగంగానే 'రాజకీయ శత్రువుల మధ్య పోటీ'ల్లాగా మారిపోయాయి. ఓటింగ్ కూడా యాంత్రికంగా జరుగుతున్న కార్యక్రమంలాగే వుంది తప్ప, దానికి వుండాల్సిన కళాకాంతులు లేనేలేవు. ఇంత దుస్థితిలోనూ నేను రాజకీయాల్ని తీవ్రంగా తప్పుపట్టబోవడం లేదు. ఎందుకంటే మనకిప్పటికీ కొంతమంది మంచి రాజనీతిజ్ఞులు మిగిలేవున్నారు. వారు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. కానీ మొత్తమ్మీద చూస్తే, రాజకీయాలన్నా, రాజకీయ నాయకులన్నా మనందరి మనసుల్లో ఒకవిధమైన విముఖత ఏర్పడిపోయింది.

మనం అవినీతి గురించి మాట్లాడతాం. చేతకానితనం, ఆశ్రిత పక్షపాతాల గురించి మాట్లాడుతుంటాం; వ్యవస్థ అవినీతిలో కూరుకుపోయిందని, రాజకీయ నాయకులంతా అవినీతిపరులేనని, వీరున్నంతకాలం దేశం ముందుకు పోదని టాపులేచిపోయేలా అరుస్తుంటాం. బోలెడు అవినీతి కేసులు, స్కామ్‌లు మన మనసులో తిరుగుతూవుంటాయి. జెఎం ఎంపీల ముడుపుల కేసు, హవాలా స్కామ్, సెయింట్‌కిట్స్ ఫోర్జరీ కేసు, రవ్వ స్కామ్, పెట్రోల్ పంపుల జారీ స్కామ్, హౌసింగ్ స్కామ్, ... వీటితోపాటు ఎన్నికల్లో నిబంధనల ఉల్లంఘన కేసులు .. ఆఖరికి దేశ ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, పెద్దపెద్ద నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా ఈ స్కామ్‌లలో భాగస్వాములనే ఆరోపణలున్నాయి.

నిజానికి, మనల్ని పాలించే అధికారం ఎవరికివ్వాలో మనమే నిర్ణయించుకోవడానికి రాజ్యాంగం, ప్రజాస్వామ్యం మనకు అవకాశాన్నిచ్చాయి. ఎక్కువమంది ఓట్లను పొందినవారు ప్రభుత్వాలను ఏర్పాటుచేస్తున్నారు. అంటే, ఏదోఒకవిధంగా

పాలనా వ్యవహారాల్లో మన పాత్ర వుంది. అయినాకూడా ఎందుకు రాజకీయాలను మన మనసుల్లోంచి తొలగించేశాం? రాజకీయాలను ఎప్పుడూ చులకన భావనలోనే చూశాం?

దీనికి సామాన్యుడు ఏం జవాబు చెప్తున్నాడంటే – "రాజకీయాలు పనికిమాలినవాళ్ళకు ఆఖరి కేంద్రాలుగా మారిపోయాయి. అవి ఎన్నడూ సమర్థత, నిజాయితీ వున్నవారికి తొలి కేంద్రాలుగా లేవు" అని. నిజంగా రాజకీయాలు అంత పనికిమాలినవే అయితే స్వతంత్రయోధులు ఎందుకు వాటిని అనుసరించారు? స్వతంత్రపోరాటంలో గాంధీ, నెహ్రూ, పటేల్, జిన్నా, మౌలానా ఆజాద్ వంటి ప్రముఖుల పేర్లను ఇవ్వాళ్టికీ మన నాలుకల మీదనుంచి ఎందుకు తలచుకుంటున్నాం?

'రాజకీయాల గురించి పేర్కొనబడిన నిర్వచనాల' గురించి చర్చించుకునే బదులు మనమందరం ఇంకోసారి "వ్యక్తుల వ్యవహారశైలే సమాజం మీద ప్రతిఫలిస్తుంటుంద"ని గుర్తుచేసుకుంటే బావుంటుంది. రాజకీయాలను అప్రియమైనవిగా భావించడం వ్యక్తులకు సరికాదు. బంగారు పళ్ళెంలో పెట్టి అందించిన స్వాతంత్ర్యానికి మనలో ఎంతమంది విలువిస్తున్నాం? పౌరులుగా మన హక్కుల్ని గురించి ప్రశ్నించే మనలో ఎంతమంది మన బాధ్యతల గురించి మాట్లాడుతున్నారు? మన పెద్దలు ఒక లక్ష్యం కోసం పోరాడిన స్ఫూర్తిని మనలో ఎంతమంది వారినుంచి స్ఫూర్తిని తీసుకోగలుగుతున్నారు? ఎంతమంది మన సమాజం మారాలని, ఆ మార్పుల కోసం దూతలుగా మానాలని ఆశిస్తున్నారు? మనలో ఎంతమంది ఇతరులపై ఎలాంటి తారతమ్యాలు లేకుండా ఒక సమభావనతో చూడగలుగుతున్నారు?

ఈరోజు ఏ పత్రిక చూసినా అవినీతి, రాజకీయ నాయకుల ప్రమేయమున్న నేరాల గురించిన వార్తల ప్రవాహమే. కానీ వ్యవస్థను సరిచేసుకునే బాధ్యత కూడా ప్రతి పౌరుడిమీదా వుంది. ప్రతి భారతీయుడూ పంచుకోవాల్సిన భారమిది. కానీ దీనిని ఒప్పుకోకుండా మనందరం ఒకరిమీద ఒకరు వేలెత్తి చూపిస్తున్నాం. రాజకీయ నాయకులను ఇంతలా విమర్శించే మీరు, ఎందుకు రాజకీయాల్లోకి వచ్చి దానిని శుభ్రం చేయడంలో భాగం పంచుకోలేకపోతున్నారు? ఈత రాని పిల్లాడు నీళ్ళలో మునిగిపోతుంటే మనకు ఈత వచ్చికూడా ఇంకెవరైనా వచ్చి రక్షిస్తారేమో చూద్దామని వేచిచూడడంలాంటిదే కదా ఇది కూడా.

నిజానికి, సమాజంలో అన్ని వర్గాల నుంచి మంచివాళ్ళకు ఎప్పుడూ కొరత లేదు. రాజకీయాల్లో కూడా సమర్థత, నిజాయితీగల నాయకుల గురించీ మనకు తెలుసు. రాజకీయ పార్టీలు తమను తాము మార్చుకుంటూ, అన్ని రంగాలనుంచీ నైపుణ్యం వున్నవారిని కలుపుకుంటూ, ప్రజాశ్రేయస్సుపై దార్శనిక దృష్టితో ముందుకు వెళ్ళాల్సిన అవసరం వుంది. మన నాయకులు కూడా రాజనీతి, మేనేజ్‌మెంట్, ఆర్థికశాస్త్రం వంటి అనేక విషయాలపై శిక్షణ తీసుకోవాల్సివుంటుంది. పనిలేనివాళ్ళనుంచి నుంచి రాజకీయాన్ని దూరంగా వుంచాలంటే రాజకీయాల్లోకి రావడమే సరైన మేనేజ్‌మెంట్ లక్షణమని నేను నమ్ముతాను. రాజకీయాలంటే ప్రజలు, వనరుల నిర్వహణే. మరోవైపు అది మానవ మనస్తత్వాల అధ్యయనం కూడా. కానీ సామాన్యులు రాజకీయాల్లోకి రాకపోవడానికి మరో కారణం దాని అస్థిరత్వం.

భారత రాజ్యాంగం పీఠికలో 'భారతీయ పౌరులమైన మేము' అంటూ మనకున్న అన్ని హక్కుల గురించి సుస్పష్టంగా ప్రకటించడం జరిగింది. ప్రజల అత్యున్నత అభిప్రాయాల్నే పార్లమెంటు ప్రతిబింబిస్తుంది. కానీ దురదృష్టవశాత్తూ ప్రస్తుతం మన చట్టాల రూపకర్తల్లో ఎక్కువమంది నేరగాళ్ళు, టౌట్స్, మానిప్యులేటర్స్, అజ్ఞానులు, అవకాశవాదులే. ఉన్నత న్యాయవాదులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, చదువుకున్న కుటుంబాలనుంచి వచ్చినవారు చాలా తక్కువమంది. చదువు, నాయకత్వ లక్షణాలున్న సాధారణ పౌరులు కొందరు రాజకీయాల్లోకి వస్తున్నప్పటికీ వారు తమకు పోటీ అవుతారనే భావంతో వారిని ఎదగనివ్వని పరిస్థితి కూడా వుంది.

రాజకీయనాయకులు ఒక వ్యక్తి 'గెలిచే సామర్థ్యా'న్ని మాత్రమే అత్యంత ముఖ్యమైన అర్హతగా పరిగణిస్తారు. నిజాయితీ, సాటిలేనితనం, చదువు, సామర్థ్యాలు ఇవన్నీ కులం కంటే ఎక్కువైనవి కాదు. గెలుపు అనే వంకతో మనం అధికారాన్ని అనర్హులకు, ఆశ్రిత పక్షపాతంతో వ్యవహరిస్తున్నవారికి కట్టబెడుతున్నాం. పెద్దపెద్దవాళ్ల పనులు ఎలాగూ అయిపోతుంటాయి. తమక్కావల్సింది ఎలా సాధించుకోవాలో వారికి తెలుసు. కానీ, స్వాతంత్ర్యం వచ్చిననాటినుంచీ భావజాలంతో సంబంధం లేకుండా ప్రతి

రాజకీయపార్టీలో అధికారం తక్కువమంది చేతుల్లో కేంద్రీకృతమైపోయివుంది.

సమాజం మీద ప్రభావం చూపించే స్థాయిలో వున్న కుటుంబాలకు చెందినవారు రాజకీయాల్లోకి వస్తున్నా, వారు రాజకీయాల్లో ముఖస్తుతి కోసమో, బతుకుతెరువు కోసమో మాత్రమే కొనసాగుతున్నారు. ఇదే పరిస్థితి ఇంతే కొనసాగితే మన చట్టాలు, వాటి రూపకర్తల నాణ్యత ఏం కావాలి? ఈ పరిస్థితికి మనం రాజకీయ నాయకులను మాత్రమే నిందిద్దామా? దురదృష్టవశాత్తూ మనలో ఎక్కువమంది దీనికి అవుననే జవాబు చెప్తారు. కానీ ఆ నాయకులు కూడా మననుంచే వచ్చారని మాత్రం మర్చిపోతున్నాం.

పలు సందర్భాల్లో అనేకమంది సీనియర్ నాయకులతో నేను మాట్లాడుతున్నప్పుడు వారిలో చాలామంది అభద్రతాభావంతో వున్నారని తెలుసుకున్నాను. ఎన్నికల్లో ఓడిపోతామని, కోరుకున్న శాఖలు దక్కవని, ఓటుబ్యాంకు, జనం మద్దతు పోగొట్టుకుంటున్నామనే భయం వారిలో బాగా వ్యాపించివుంది. ఎవరైనా నాయకుడు నిజంగా ప్రజలకేదైనా మేలు చేద్దామనుకున్నా, వ్యవస్థ వారికి అనేక అడ్డంకులు కల్పిస్తుంది, బలవంతంగానైనా తప్పు చేయిస్తుంది. ఇలాంటి బలవంతాలు ఒక నాయకుడికి ఎన్నుంటాయో! చదువు తక్కువ కావడంవల్ల పార్లమెంటరీ అంశాల్లో అవగాహన లేక నియోజకవర్గానికే పరిమితం కావడం; ఒక గుత్తేదారు నుంచి బాస్ దాకా అందరినీ సంతృప్తిపరచాల్సిరావడం మొదలైన అడ్డంకులు కూడా వారి ఆసక్తిని దెబ్బతీస్తున్నాయి. దీనివల్ల వారు కూడా అవినీతికి తలొగ్గక తప్పడంలేదు. ఈమధ్యకాలంలో మీడియా చేస్తున్న స్టింగ్ ఆపరేషన్లకు ఎక్కువగా రాజకీయ నాయకులే దొరికిపోవడానికి కారణం కూడా ఇదే. సీబీఐ పేర్కొంటున్న అవినీతి నేతల లిస్టులో తమ పేరుండడం ఒక నాయకుడికి పీడకలే. దీనికితోడు ప్రత్యర్థుల విమర్శలూ తప్పవు. ఫలితంగా రాజకీయ నాయకులంతా అవినీతిపరులేననే పేరును మోయాల్సివస్తోంది.

అవినీతి ఉన్నతస్థాయి నుంచి కిందికి పాకుతుందని కొందరు ప్రభుత్వాధికారులు, న్యాయమూర్తులు ఉటంకిస్తుండడాన్ని ఇటీవల చర్చల్లో గమనిస్తున్నాం. వారు కూడా రాజకీయ నాయకులు, వ్యవస్థలే ఈ దుస్థితికి కారణమంటున్నారు. వ్యవస్థ ఇలా పుచ్చిపోవడానికి రాజకీయనాయకులే కారణమని పదవీ విరమణ చేసిన ఢిల్లీ సెషన్స్ జడ్జి ప్రేమ్‌కుమార్ నాతో అన్నారు. రాజకీయాల మీదున్న మన ద్వేషమే నాయకులను ద్వేషించేలా చేస్తోంది.

రాజకీయాల్లో వరదలై పారుతున్న డబ్బు, కండబలాలను ఎదుర్కొని, నిజాయితీ, శక్తి కలిగిన యువతను తీసుకురావడం ద్వారా పరిశుద్ధమైన రాజకీయాలను సాధించుకోవాలనే చర్చ మాత్రం ఎక్కడా జరగడంలేదు. దీనికి బదులు మనం ఇంకా 'రాజకీయాలు మన పని కాదు; అవి పనిలేనివాళ్ళ కోసం' అనే మన పాతచింతకాయ మాటల్ని పట్టుకుని ఊరేగుతున్నాం. రాజకీయ పార్టీలు ఏవిధంగా నిధులు సమకూర్చుకుంటున్నాయి, వాటినెలా ఖర్చుపెడుతున్నాయి, ఆదాయవ్యయాల నిర్వహణను మన పార్టీలు ఏవీ బయటపెట్టడం లేదు.* రాజకీయ కార్యకలాపాల్లో డబ్బు, కండబలాల పొత్తును అడ్డుకునే చట్టాలేవీ లేవు. ఈ విషయం మీద పదేపదే చర్చలు జరగాల్సిన అవసరం వుంది.

ప్రజాస్వామ్యంలో జీవిస్తున్న ఏ వ్యక్తి అయినా రాజకీయాల్ని ద్వేషిస్తున్నాడంటే అతనికి ప్రజాస్వామ్య సంస్థల మీద కనీసగౌరవం లేదని నేను భావిస్తాను. ప్రజాస్వామ్యంలో రాజకీయాలు మురికిపట్టినవని, వాటినలా వదిలేయాల్సిందే అనే హక్కు ఎవరికీ లేదంటాను. రాజకీయాలు నిజంగా మురికిపట్టిపోయివుంటే శుభ్రం చేయడానికి నువ్వెందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నిస్తాను. రాజకీయనాయకులను పనికిమాలినవాళ్ళు, పనిలేనివాళ్ళు అని పిలిచేబదులు వారి స్థానంలో మంచివాళ్ళు ఎందుకు రారని అడుగుతున్నాను. రాజకీయాలకంటే గొప్ప వృత్తులు వున్నప్పటికీ జాతి భవిష్యత్‌ను నిర్ణయించే మహత్తర శక్తి మాత్రం రాజకీయాలకే వుంది.

ఇప్పుడు మనం రాజకీయాలను దేశాన్ని ప్రేమించే సామాన్యపౌరుడు కూడా అందుకోగల పరిస్థితులను సృష్టించుకోవాలి. ఇందుకోసం అనువైన వ్యవస్థను డబ్బు, కండబలాల ప్రస్తావన లేకుండా నిర్మించుకోవాల్సివుంది. ఇప్పుడు బాగా చర్చ జరగాల్సింది దీనిమీదే.

ఇలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలంటే మనకు ప్రస్తుత పరిస్థితికి పూర్తిగా విరుద్ధమైన రాజకీయ నాయకులు అవసరం. ప్రతి నాయకుడికీ ఖచ్చితంగా ఆర్థికాంశాలమీద అవగాహన వుండాలి. దేశ ఆర్థిక పరిస్థితుల గురించి అవగాహన లేకుండా ఎవరూ నాయకులు కాలేరు. ఇది చాలా పెద్ద పనే. 'బాబు'లు వస్తారు, పోతారు. కానీ రాజకీయ నాయకులు తమ జీవితాంతం

బరిలో వుండాల్సిందే; అధికారంలో వున్నా, లేకపోయినా! చదువుకున్న, నిజాయితీ గల వ్యక్తులు రాజకీయాల్లో లేకపోతే పార్టీలు మేథోపరమైన చీకట్లో పడిపోతాయి. ప్రొఫెసర్లు, డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, అన్ని ఇతర వృత్తులనుంచి వచ్చినవారు రాజకీయాల్లో వుంటే పార్టీలు ప్రస్తుతం మోస్తున్న డబ్బు సంచుల బరువు దించుకోగల అవకాశం ఏర్పడుతుంది. దేశానికి సరైన దిశానిర్దేశం చేయగలిగేది వీళ్లే.

ఒక ప్రజాప్రతినిధి విజయం సాధించాలంటే తన నియోజకవర్గాన్ని బాగా ఆకట్టుకోవాలి; నిరంతరం ప్రజలతో సంబంధాలు నెరుపుతుండాలి. స్థానికంగా వనరులు, సంస్కృతి, విద్య, ఆరోగ్యం, ఉపాధి తదితర అంశాలపై అవగాహన తోపాటు, నియోజకవర్గ ప్రజల సమస్యల గురించి గట్టి అవగాహన వుండాలి. ఇవే అతనిని నిజమైన ప్రజాప్రతినిధిగా నిలబెడతాయి, అభివృద్ధికి బీజం వేస్తాయి. ఒక జిల్లా స్థాయిలో ఒక ఎంపీ ఆ జిల్లా కలెక్టర్ / జిల్లా మేజిస్ట్రేట్ కంటే ఎక్కువ అవగాహన కలిగివుండాలి. ప్రజాశ్రేయస్సును దృష్టిలో వుంచుకుని అవసరమైన విధానాల్ని కూడా రూపొందించగలిగివుండాలి. ఇందుకోసం అతనికి రాజ్యాంగం తెలిసివుండాలి. సమాజంలో వేగంగా జరుగుతున్న మార్పుల గురించి తెలిసివుండాలి. మంచి రాజకీయవేత్త తన నియోజకవర్గానికి మంచి మేనేజర్‌గా వుండాలి. ఇందుకోసం కావల్సిన అధ్యయనం, సమయాన్ని కేటాయించుకుంటేనే ఇది సాధ్యమవుతుంది.

రాజకీయాలు విశ్వవిద్యాలయాల స్థాయిలో విశేషాంశాలుగా బోధించాల్సిన అవసరం వుందని నేను భావిస్తాను. రాజకీయాల కోసం ప్రత్యేకంగా ఒక యూనివర్సిటీ వుంటే యువత మంచి నాయకులుగా, వ్యూహకర్తలుగా, రాజనీతిజ్ఞులుగా మారడానికి ఆస్కారం అభిస్తుంది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో గ్రామాలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చాలని మన మాజీ రాష్ట్రపతి (ప్రొఫెసర్ అబ్దుల్ కలాం) చేసిన సూచనలు గుర్తుంచుకోవాలి. మనకున్న అద్వితీయమైన రాజ్యాంగాన్ని ఎప్పటికప్పుడు సవరించుకుంటూ మరింత సుసంపన్నం చేసుకుంటున్నాం. ప్రాథమిక హక్కులు, ఆదేశసూత్రాల వంటి వజ్రాల్లాంటి అంశాలు మన రాజ్యాంగంలో వున్నాయి. వాటిని సరైన పద్ధతిలో వినియోగించుకుంటూ .. రాజకీయాలంటే ప్రజల జీవితాల్ని మరింత మెరుగుపరచుకోవడమే అని నిరూపించడం ద్వారా, మిగిలిన ప్రపంచానికి తెలియజెప్పాల్సిన బాధ్యత పౌరులుగా మనందరిదీ!

(రచయిత ఢిల్లీలో ప్రముఖ న్యాయవాది. తాను స్థాపించిన 'బిల్డ్ఇండియా గ్రూప్' ద్వారా ప్రజలతో దేశం కోసం ప్రతిజ్ఞలు చేయించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 'మై కాల్' పేరుతో ఆయనొక పుస్తకం కూడా రాశారు).

■ దేశం మొత్తమ్మీద ఒక్క లోక్‌సత్తా పార్టీ మాత్రమే తనకు ఏవిధంగా నిధులు అందుతున్నాయి, వాటిని ఏవిధంగా ఖర్చుపెడుతున్నామన్న వివరాలను తన అధికారిక వెబ్‌సైట్ ద్వారా ప్రజలకు తెలియజేస్తోంది. ■

**... 9 వ పేజీ తరువాయి**

చేయూతనివ్వండి. సెలవురోజుల్లో మీరు నివసించే ప్రాంతాల్లో ప్రజలు ఓటర్లుగా నమోదు కాబడ్డారా లేదా అని సర్వే చేయండి. చేసుకోనివారికి ఆ పద్ధతిని వివరించి ప్రోత్సహించండి. ప్రజల బాధ్యత అని తెలియచేయండి. ఎవరికి వారు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలనే విషయం తెలియచెప్పండి. ఓటరుగా నమోదు చేసుకోవడం దేశపౌరులుగా ప్రతీ వ్యక్తీ చేయాల్సిన పని.

అవినీతిని అరికట్టడానికి నీతి నిజాయితీ సేవాగుణం గలవారిని ఎన్నుకోడానికి ఒకే ఒక్క ఉపాయం ఓటుహక్కు. ఓటు వేసేవారి శాతం తగ్గిపోవడం వలన నేరపూరిత వాతావరణానానికి, గూండాయిజానికీ అవకాశం కల్పిస్తున్నామని గుర్తించండి. స్వరాజ్యం సంపాదించి సాధించిన దానికంటే సురాజ్యానికి బాటలు వేసి భారత యువశక్తి నశించిపోలేదని నిరూపించాలి. రాబోయే తరానికి చక్కని భవితను నిర్మించాలి. ఒక ప్రభంజనమై నూతన శకానికి నాంది పలకాలి. దేశ కాల పరిస్థితులను తెలిసిన మీరు పాత రాజకీయాన్ని తుడిచిపెట్టి కొత్త రాజకీయాన్ని సాధించుకోవలసిన సమయం ఇది. కేవలం డబ్బు మద్యంతో ప్రజలను మభ్యపెట్ట గలమనుకునేవారికి తగిన బుద్ధి చెప్పాల్సిన తరుణం ఇదే! ప్రజలు ప్రలోభాలకు లొంగిపోయే బలహీనులు కారని విచక్షణ గలవారు. వివేకవంతులు మాత్రమేనని నిరూపించండి. ఆత్మాభిమానం కర్తవ్యదీక్షతో ముందుకు వచ్చి నిర్భయంగా పోరాటం చేయాల్సిన తగిన అవకాశం ఇది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోలేని వారు రాబోయే తరాన్ని ఇక ఎన్నటికీ రక్షించుకోలేరు. సరికదా మీ చేతుల్తో మీ బిడ్డల భవిష్యత్‌ను ఛిద్రం చేసినవారు కాగలరు. ■

# రాజనీతి, జనహితం రెండూ వేరువేరు కాదు

- సురేశ్ వెలుగూరి

పార్టీలతో సంబంధం లేకుండా ఈరోజు దేశంలోని ప్రజలందరూ రాజకీయ వ్యవస్థ మీద తీవ్రమైన కోపంతో వున్నారు. జీవన వ్యయం ఏ రోజుకారోజు విపరీతంగా పెరిగిపోతుండడం ఇందుకు ఒక కారణమైతే, ఇటువంటి పరిస్థితులను నివారించాల్సిన రాజకీయ వ్యవస్థ తన బాధ్యతల్ని విస్మరించి, తమ సొంత ఆస్తులు పెంచుకోవడం కోసమే పనిచేస్తుండడం మరో కారణం. ఆఖరికి ప్రజలెంతగా విసిగిపోయారంటే – రాజకీయ పార్టీలంటే తమ జేబులు కత్తిరించడానికి పుట్టిన దొంగల వ్యవస్థలుగా భావిస్తున్నారు. దేశంలోని అన్ని పరిపాలనా వ్యవస్థలనీ కుదేలయ్యేలా చేసింది మన రాజకీయ వ్యవస్థేనని వారు బలంగా నమ్ముతున్నారు. కానీ రాజకీయ పక్షాలు మాత్రం జనం అభిప్రాయం తప్పంటున్నాయి. తాము పూర్తిగా ప్రజల కోసమే పనిచేస్తున్నామని, రాజనీతి, జనసంక్షేమం రెండింటినీ వేర్వేరుగా చూడాలని అంటున్నాయి. ఏది నిజం?

**దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన తరువాత లార్డ్ మౌంట్‌బాటన్ ప్రధాని నెహ్రూను అడిగారట –వేం వెళ్ళిపోతున్నాం కదా, ఇక మీ దేశప్రజలు తిరగబడదానికి ఇంకెవరున్నారు అని. 'మేము లేమా?' అన్నారట నెహ్రూ. 'ఇప్పటివరకూ మీమీద జరిగిన తిరుగుబాట్లు ఇక మామీద మొదలవుతాయి. మీరు తుడుచుకున్న దుమ్ముధూళి ఇక మేము తుడుచుకోవాల్సివస్తుంది' అన్నారట.** వాస్తవంలో కూడా అదే జరిగింది. సొంత పాలనలోనూ పరిపాలనా వికేంద్రీకరణ జరగలేదు. ఫలితంగాఈ అరవై అయిదేళ్ళలో మన రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ప్రజలకు ఎంత దూరం కావాలో అంత దూరమయ్యాయి. ఇందుకు కారణం మన రాజకీయ వ్యవస్థ మారుతున్న తీరుతెన్నులే.

నూటికి 70 శాతం మంది గ్రామాల మీదే ఆధారపడి జీవిస్తున్న భారతదేశంలో స్థానికాంశాల మీద ప్రజలకు మంచి పట్టే వుంటుంది. కానీ తమ ఊరు దాటి ఆపైన ఆలోచించడానికి వారి శక్తి సరిపోవడంలేదు. సాదాసీదా ప్రజలకు రాజనీతి అనే పదమే భయం పుట్టిస్తుంటుంది. ఈ పరిస్థితే రాజకీయ పార్టీలకు వరంగా మారుతోంది. ఎక్కడికక్కడ వనరుల మీద అవగాహన, రాజ్యాంగసంస్థలు, పాలనలోని లొసుగులు, తిమ్మిని బమ్మిని చేయగల గుణాలున్నవారు నేతలుగా ఎదిగిపోతున్నారు.

గ్రామపంచాయతీ స్థాయి నుంచి మెట్రో నగరాల దాకా ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులంతా వారి అధికారాలకు ధర్మకర్తలే తప్ప చక్రవర్తులు కాదు. కానీ, ఇందుకు విరుద్ధంగా వ్యవహరించడంవల్ల ఈరోజు ఆ పార్టీల మనుగడే ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితిని చూస్తున్నాం. దేశవ్యాప్తంగా పెద్దసంఖ్యలో రాజకీయ పార్టీల నేతలు జైళ్ళకు తరలిపోతున్నారు. కొన్ని వందలమంది నాయకులపై కేసులు నడుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇప్పుడు కనీసం 50 మంది నాయకుల మీద 'బలమైన సాక్ష్యాలున్న' కేసులు నడుస్తున్నాయి. అయితే సమస్యలన్నీ తాము జనసంక్షేమ బాధ్యతనుంచి దూరం కావడం వల్ల వచ్చినవేనని ఒప్పుకోవడానికి మాత్రం వారు సిద్ధంగా లేరు. ప్రజలు ఒక్కసారి తమకు బాధ్యత అప్పజెప్పాక అయిదేళ్ళపాటు నోరెత్తకూడదని నాయకులు భావిస్తున్నారు. పాలించుకోవడం వారికి చేతకాకనే తమకు అప్పగించారని, దీనినిబట్టి వారికేం కావాలో తమకు మాత్రమే తెలుసని జనం ఒప్పుకున్నట్టేకదా అని తిరిగి ప్రశ్నిస్తున్నారు.

ప్రజల విశ్వాసం లేనిదే తమకు మనుగడ లేదని తెలుసు కాబట్టి ఇందుకోసం ఎప్పటికప్పుడు తాజా ఎరలు వేయడానికే పార్టీలు మొగ్గుచూపిస్తున్నాయి. అంతేకానీ, ప్రజాభీష్టం ప్రకారం పనిచేసి, ఫలితాలు చూపించి వారి విశ్వాసం పొందాలని దురదృష్టవశాత్తూ ఈరోజు సంప్రదాయ రాజకీయ పార్టీలేవీ భావించడం లేదు. ఉచిత హామీలు, కానుకలు, మత విశ్వాసాలు, కుల సమీకరణాలు, జాతి వైరుధ్యాలను అడ్డం పెట్టుకుని మరీ, ఇంకో ఐదేళ్ళు పాలించేందుకు మన పార్టీలు నిస్సిగ్గుగా ముందుకువెళ్తున్నాయి. ఆటగాళ్ళు మారుతున్నారు కానీ, ఆట నియమాలు అలాగే వున్నాయి. ఒక ఐదేళ్ళు ఒక పార్టీ, ఇంకో అయిదేళ్ళు ఇంకో పార్టీ పాలిస్తూ కొత్త దొంగల్ని తరచూ కలుపుకుంటూ వెళ్తున్నాయి.

పూనే లోని ఎమ్ఐటి స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో ఇటీవల

జరిగిన ఒక సెమినార్‌లో పాల్గొనేందుకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన కొందరు పరిశోధన విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య ఈ అంశం మీద గట్టి చర్చే జరిగింది. రాజకీయ పార్టీలు, నాయకులే ప్రజలను ఇవ్వాళ్టి దుస్థితికి తీసుకువచ్చారని పరిశోధన విద్యార్థులు అభిప్రాయపడితే, ఈ అభిప్రాయం పూర్తిగా సరైనది కాదని, ఇందులో ప్రజల పాత్ర కూడా సంశయాత్మక అంశమేనని కొందరు సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. పరిపాలన ముందుకు సాగకుండా పార్టీలు, నేతలే అడ్డుపడుతున్నారన్నారు. కానీ రాజకీయ పార్టీల కార్యకర్తలు మాత్రం ఇందుకు భిన్నంగా మాట్లాడారు. ప్రభుత్వాధికారులు స్థానిక అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి సాయమూ చేయరని, ఆ ప్రాంతాల్లో వారి బాధ్యతను తాము నిర్వరిస్తున్నామని, ప్రజలు 'సంతోషంగా' ఇచ్చేవాటిని వేతనాలుగా భావిస్తున్నామని కొందరు మాట్లాడారు. దేశవ్యాప్తంగా బస్తీలు, మురికివాడలు, పల్లెల్లో ఛోటానాయకుల హవా పెరగడానికి కారణం స్థానికాంశాల మీద పట్టు సాధించడమే. ఇంకొందరైతే ఈ దేశానికి ప్రజాస్వామ్యం పనికిరాదని, నియంతృత్వం కావాలని, తప్పు చేస్తే అక్కడికక్కడ శిక్షించే తరహా వ్యవస్థ రావాలని ఆవేశపడ్డారు.

కొన్ని గంటలపాటు జరిగిన వాదనల్లో చివరికి అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారు. ప్రజాస్వామ్యం సక్రమంగా నడవాలంటే కుదురైన రాజకీయ, ఎన్నికల వ్యవస్థలుండి తీరాలని, అవి బలంగా, నిజాయితీగా పని చేయడానికి కావాల్సిన వాతావరణం వుండాలన్నారు. అలాగే ప్రతిదానికీ రాజకీయ పార్టీలను దుమ్మెత్తి పోయడం సరికాదని, ఇందులో ప్రజలూ తమ బాధ్యతను పంచుకుంటేనే ప్రజాస్వామ్య పునాదులు బలపడతాయన్నారు. పాలనలో ప్రజల బాధ్యతే కీలకమని, తమ హక్కుల్ని తాము కాపాడుకుంటూ, అవసరమైన సందర్భాల్లో ప్రశ్నించే స్వభావాన్ని అలవరచుకుంటే రాజకీయ వ్యవస్థ పారదర్శకమవుతుందన్న భావన అందరిలోనూ వ్యక్తమైంది.

తప్పు ఎలా జరిగితే దానిని అలాగే సరిచేయాలనుకోవడం సరికాదు. ముల్లుకు ముల్లు, కంటికి కన్ను సిద్ధాంతం రాజకీయాలు, పరిపాలనకు వర్తించదు. జనసంక్షేమం మాత్రమే పార్టీల ఎజెండా కావాలి. రాజనీతి చూపించాల్సింది కేవలం ప్రజాక్షేమం కోసమే తప్ప సొంత ప్రయోజనాల కోసం కాదని పార్టీలు, నాయకులు గ్రహించాలి. ఇంకో దశాబ్దకాలంలో ప్రపంచవ్యాప్తంగా పార్టీల హవా తగ్గిపోతుందని, పెరుగుతున్న విద్య, సాంకేతిక పరిజ్ఞానాల ఫలితంగా ప్రజలే ఎక్కడికక్కడ తమకేం కావాలో నిర్ణయించుకునే పరిస్థితి ఏర్పడుతుందని సుప్రసిద్ధ సామాజికవేత్తలు చెప్తున్న విషయాన్నీ వారు గ్రహించాలి. లేదంటే ఆనాటికి తమ ఉనికి కూడా మిగలదని రాజకీయ పార్టీలు, నేతలు గుర్తుంచుకోవాలి.

**(రచయిత 'విఎమ్ఆర్‌జి స్కూల్ ఆఫ్ గవర్నెన్స్ & లీడర్‌షిప్ మేనేజ్‌మెంట్' ప్రిన్సిపాల్)** ■




Vote-Power-Money

# లక్ష్య సాధనాలుగా నగదు బదిలీలు

- డి.వి.వి.యస్. వర్మ

సెప్టెంబర్ 1, 2012 నుండి రాష్ట్రంలో కిరోసిన్‌కు నగదు బదిలీ పథకం ప్రయోగాత్మకంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్ జిల్లాలో 10, తూర్పుగోదావరి జిల్లాలో 35, మొత్తం 45 రేషన్‌షాపులలో ఈ పథకం అమలుకు శ్రీకారం చుడుతున్నారు. ప్రస్తుతం పట్టణాలలో రేషన్‌కార్డుల మీద పేదలకు నెలకు నాలుగు లీటర్లు, ఇతర ప్రాంతాలలో రెండు లీటర్లు, దీపం పథకం కింద సిలిండర్ పొందిన వారికి 1 లీటరు చొప్పున రేషన్‌షాపుల ద్వారా ఇస్తున్నారు. ప్రభుత్వం లీటరు కిరోసిన్‌కు 48 రూపాయలకు కొనుగోలు చేసి లబ్ధిదారులకు 15 రూపాయలకు అందిస్తున్నది. అంటే ప్రతి లీటరుకు ప్రభుత్వం 33 రూపాయలు సబ్సిడీని భరిస్తున్నది. ఈ నగదు బదిలీ అమలులోకి వచ్చేచోట ఎన్ని లీటర్లకు లబ్ధిదారులు అర్హులైతే అన్ని లీటర్లకు 33 రూపాయల వంతున వారి బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేస్తారు. లబ్ధిదారులు మార్కెట్ ధరకు కిరోసిన్‌ను కొనుగోలు చేసుకోవాలి. ఒక నెలలో వారు కొనుగోలు చేయకపోతే ఆ మొత్తం తిరిగి ప్రభుత్వానికి చేరుతుంది. లబ్ధిదారులకు విధిగా ఆధార్‌కార్డులు వుండేలా, బ్యాంకు ఖాతాలు వుండేలా ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ సక్రమంగా జరిగినప్పటికీ ప్రభుత్వం ఆశిస్తున్నట్లుగా కిరోసిన్ అవసరం లేని కొనుగోలుదారుల్ని, ఆ తర్వాత జరిగే బ్లాక్ మార్కెట్‌నూ ఇది నిరోధించేదిగా లేదు. గతంలో లాగే అవసరం లేనివారు లీటరుకు పదో, పదిహేనో డబ్బును డీలర్‌కు ముట్టజెప్పి మిగిలిన సబ్సిడీ సొమ్ముతో లబ్ధిదారులు సంతృప్తిపడతారు. పోతే నిజంగా అవసరం వున్న వారికి మార్కెట్‌లో కిరోసిన్ ధర పెరిగితే ఆ అదనపు మొత్తాన్ని తామే భరించుకోవలసి వస్తుందన్న ఆందోళన వుంది. అందుచేత నగదు బదిలీ పథకాలను ప్రవేశపెట్టేముందు అనుకున్న లక్ష్యాలు సాధించే విధంగా వాటిని రూపొందించడం అవసరం.

2012-13 సంవత్సరానికి కేంద్రబడ్జెట్‌పై ఆర్థికమంత్రి ప్రసంగంలో ఎరువులు, గ్యాస్‌సిలిండర్లు, కిరోసిన్‌లపై ఇస్తున్న పరోక్ష సబ్సిడీల స్థానంలో నేరుగా లబ్ధిదారుకు నగదు బదిలీ చేయనున్నట్లు ప్రకటించారు. ఇది చిన్న విషయం కాదు.




విధానపరంగా పెద్దమలుపు. దీనివెనుక చాలా కారణాలు కనిపిస్తున్నాయి. రాను రాను సబ్సిడీల భారం పెరుగుతూ పోవడంతో బడ్జెట్లు దీనిని భరించలేని స్థితి ఏర్పడింది. 2001లో 7, 500 వేల కోట్లు వున్న కిరోసిన్ సబ్సిడీ 2011నాటికి 20 వేల 500 కోట్లకు పెరిగింది. అదేకాలంలో గ్యాస్ సిలిండర్ల మీద సబ్సిడీ 6 వేల 700 కోట్లు నుండి 24,000 కోట్లు అయింది. డీజిల్ మీద సబ్సిడీ 7,500 కోట్లు నుండి 34,000 కోట్లు, ఎరువుల మీద వున్న14,000 కోట్లు వుంటే అది 55,000 కోట్లకీ, ఆహార వస్తువుల మీద 12,000 కోట్లు వుంటే సబ్సిడీ 2011 నాటికి 60,500 కోట్లు అయింది.

ఇంతగా సబ్సిడీలు ఇస్తున్నా వ్యవసాయరంగంలో, పేదరికనిర్మూలనలో ఆశించిన ఫలితాలు రావడం లేదు. పైగా ఈ సబ్సిడీలు దారిమళ్లడం, అవినీతికి ఆలవాలం కావడం సాగిపోతున్నది. సొమ్ముపోయే శనిపట్టినట్టు పరిస్థితి తయారైంది.

మరొకపక్క బోగస్‌కార్డుల ఏరివేతకు తగిన సాంకేతిక పరిజ్ఞానం రావడం, ఆధార్‌కార్డుల పంపిణీ పెద్దఎత్తున సాగించడం, బ్యాంకులు, పోస్టాఫీసులు ఆర్థిక లావాదేవీలను సమర్థవంతంగా నిర్వహించగల స్థితిలో వుండడం, జాతీయ ఉపాధిపథకం అమలులో నేరుగా లబ్ధిదారులకు వేతనాల పంపిణీ వంటి అనుభవాలు గత సబ్సిడీపద్ధతి మార్చాలన్న ప్రయత్నాలకు సానుకూల అంశాలుగా భావించబడుతున్నాయి. ప్రపంచంలో పలుదేశాలలో పేదరికనిర్మూలనకు నిర్దేశిత లక్ష్యాల సాధనకు నగదు బదిలీ పథకాలు అమలు అవుతున్నాయి. షరతులతో కూడిన నగదు బదిలీపథకాలు లాటిన్ అమెరికా దేశాలలో మంచి ఫలితాలు సాధించడంతో అందరి దృష్టి వాటిమీద పడింది.

బ్రెజిల్‌లో షరతులతో కూడిన నగదు బదిలీ పథకాలను 2003లో ఏకీకృతం చేసి బోల్సాఫెమిలియా పేరుతో నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రాథమిక విద్యకు కనీసగ్రాంటు, ఆహారభద్రతకు సంబంధించిన నగదు బదిలీ; వంటగ్యాస్‌కు ఇచ్చే సబ్సిడీలను నగదు బదిలీ చేస్తున్నారు. కుటుంబంలోని మహిళ యజమానురాలి పేరుమీద "సిటిజన్ కార్డు" పంపిణీ చేసి బ్యాంకుల ద్వారా నగదు బదిలీ చేస్తున్నారు. దీని ఫలితంగా పోషకాహారలోపం గణనీయంగా తగ్గడం ,బడి బయట పిల్లలు లేకపోవడం, మధ్యంతరంగా మానేసేవారి సంఖ్య బాగా తగ్గడం, పిల్లలకి వ్యాధినిరోధక టీకాలు పూర్తిస్థాయిలో జరగడం వంటి ఫలితాలు బాగా మెరుగైనట్లు అన్ని దేశాలు అంగీకరిస్తున్నాయి.

ఈ నగదు బదిలీ పథకం 1997లో మెక్సికోతో ప్రారంభించారు. ముందుగా ప్రొగ్రెసా పేరుతో ప్రారంభమై తర్వాత నగదు బదిలీపథకం "ఆ పర్చు నిడాడెస్" పేరుతో విస్తరించింది. అక్కడ కూడా ఫలితాలు ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షించే విధంగా వచ్చాయి. అనేక దేశాలు నగదు బదిలీబాట పట్టాయి. కొలంబియా 2000 సంవత్సరంలో, ఎల్‌సాల్వెడార్‌లో 2005లో, నికరగ్వువాలో 2000లో, పరాగ్వేలో 2005లో, దక్షిణాఫ్రికాలో 1998లో, ఇలా చాలా దేశాలకు నగదు బదిలీ పథకాలు విస్తరించి అమలులో వున్నాయి. వివిధ దేశాలలో నగదు బదిలీ పథకాలు సారిస్తున్న ఫలితాల ప్రభావం కూడా నగదు బదిలీల మీద దృష్టిపడడానికి కారణంగా కనిపిస్తున్నది.

నగదు బదిలీ అన్నపేరు వాడకపోయినా ప్రత్యక్షంగా లబ్ధిదారులకు నగదు చెల్లించే పద్ధతి మన దేశానికి, రాష్ట్రాలకి కొత్తకాదు. జీవనభద్రత కోసం సంక్షేమ పథకంగా ఇస్తున్న పెన్షన్‌లు మాతా శిశు సంరక్షణకు ప్రవేశపెట్టిన పలు పథకాలు నగదు బదిలీ పథకాలే. ఒకనాడు నిర్వహించిన "పనికి ఆహారం" పథకం వస్తు బదిలీపథకం అయితే ఇప్పుడు గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరుతో అతిపెద్ద నగదు బదిలీ పథకంగా వుంది. బడుగు బలహీనవర్గాల పిల్లల చదువులకు ఇస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్లు నగదు బదిలీ పథకాలే.

అయితే ఇప్పుడు ప్రభుత్వం ప్రారంభించిన కిరోసిన్‌కు నగదు బదిలీ లేదా గ్యాస్ సిలిండర్లు, ఎరువుల సబ్సిడీలకు నగదు బదిలీ పథకాలు కొంత సంక్లిష్టమైనవి. ఈ పథకాలను తగిన జాగ్రత్తలతో రూపొందించకపోతే ఇటు ప్రభుత్వానికి, అటు లబ్ధిదారులకీ ప్రయోజనం కలగని స్థితి వస్తుంది.

ఇప్పుడు కిరోసిన్ నగదు బదిలీ అంశాలను మరింత లోతుగా పరిశీలించాలి. పేదలు వంట చేసుకోడానికి, దీపాలు వెలిగించుకోడానికి వీలుగా సబ్సిడీపై కిరోసిన్‌ను ఇస్తున్నారు. కిరోసిన్ మీద ఎంతమంది వంట చేసుకుంటున్నారు. దీపాల కోసం ఎంతమందికి కిరోసిన్ అవసరం అన్న దానితో నిమిత్తం లేకుండా ప్రతి రేషన్‌కార్డుకీ ఒకే తీరున కిరోసిన్ పంపిణీతో ఈ సబ్సిడీ తలబరువైంది. అవసరం లేనివాళ్లు చౌకగా తిరిగి డీలర్‌కే అమ్మడం, పెద్దస్థాయిలో కిరోసిన్ బ్లాక్ మార్కెట్‌కీ, డీజిల్‌లో కల్తీకి కారణం అవుతున్నది.

మనదేశంలో గ్రామీణప్రాంతంలో కిరోసిన్‌తో వంట చేసుకునేవారు శాతం 2001లో 2 శాతం వుంటే అది 2008 నాటికి 0.6 శాతానికి పడిపోయింది. పట్టణాలలో అదే కాలంలో 15.3 శాతం నుండి 7.6 శాతానికి తగ్గింది. నిజానికి దేశంలో కిరోసిన్‌ను వంటకంటే దీపాలకే ఎక్కువ మంది వినియోగించుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో కిరోసిన్ దీపాలు వాడే వారి సంఖ్య 2002లో 47.2 శాతం వుంటే, అది 2008కి 38.00 శాతానికి తగ్గింది. అదేకాలంలో పట్టణాలలో 7.8 శాతం నుండి 5 శాతానికి పడిపోయింది.

మనరాష్ట్రంలో 2011 గణాంకాల ప్రకారం కిరోసిన్‌తో వంట చేసుకునేవారు కేవలం 3.9 శాతం కుటుంబాలు మాత్రమే వున్నాయి. అలాగే దీపాలకు వాడుకునేవాళ్ళు రాష్ట్రంలో 6.9 శాతం మాత్రమే. అంటే మొత్తంమీద 10.8 శాతం కుటుంబాలు కిరోసిన్‌ను ఏదోరకంగా వాడుతున్నారు. కాని అన్ని రేషన్‌కార్డులకు కిరోసిన్ ఇస్తున్నారు. దాదాపు 90శాతం కుటుంబాలకు అవసరం లేకపోయినా కిరోసిన్‌ను పొందుతున్నారు. ఇదే బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతున్నది.

ఆసియా దేశాలలో అతి ఎక్కువ సబ్సీడీతో అతి తక్కువ ధరకి అందిస్తున్న దేశంగా భారతదేశం వుంది. తగ్గుతున్న కిరోసిన్ వాడకాన్ని దృష్టిలో పెట్టుకోకుండా కార్డుదారులందరికీ పంపిణీ చేయడంతో అది పెద్దస్థాయిలో బ్లాక్ మార్కెట్‌కి తరలిపోతున్నది. మహారాష్ట్రలో అడిషనల్ డిస్ట్రిక్ట్ కలెక్టరు యస్వంత్‌సోనావానే హత్య కిరోసిన్ మాఫియా చేసిందే. ఇలాంటి హత్యలు ఇప్పటికీ జరుగుతూనే వున్నాయి. కిరోసిన్‌పై ఇస్తున్న 20,000 కోట్ల సబ్సీడీలో 8000 కోట్లు ఈ మాఫియాలపరం అవుతున్నది. దీనిని డీజిల్‌లో కల్తీ చెయ్యడంతో ఒక పక్క వాయుకాలుష్యం, మరోపక్క ట్రక్కులు, కార్లు రిపేర్ల పాలవుతున్నాయి. అందుచేత అవసరమైన వారికి మాత్రమే కిరోసిన్ అందే ఏర్పాటు వుండాలి తప్ప మూకుమ్మడిగా సబ్సీడీ కిరోసిన్ పంపిణీ చెయ్యడం మాఫియాలను పెంచిపోషించడం అవుతుంది.

కాని ప్రస్తుతం సబ్సీడీ కిరోసిన్‌కు నగదు బదిలీ పథకాన్ని వర్తింపజేసినా అదనపు కిరోసిన్‌మాత్రం బ్లాక్ మార్కెట్‌కు రావడం ఆగిపోదు. నగదు బదిలీ పథకాల ఉద్దేశం ప్రభుత్వ వ్యయాన్ని దుబారాని తగ్గించటం, లబ్ధిదారులకు నేరుగా సబ్సీడీని అందించటంగా వున్నప్పటికీ, అసలు పథకంలోనే లోపాలుంటే పరిస్థితి యధాతధంగానే వుంటుంది. అందువల్ల నగదు బదిలీయే తప్పు అనడం సరికాదు. ప్రజా పంపిణీ ద్వారా ఇస్తున్న ఆహార వస్తువులన్నింటికీ నగదు బదిలీని ఆహార కూపన్లుగా ఇస్తే కనీసం తమకు అవసరం లేనివాటి మీద కాకుండా అవసరమైన వాటికి ఈ కూపన్లు అదనంగా వినియోగపడతాయి. అలాగే పిల్లల చదువు, వ్యాధి నిరోధక టీకాలు, ఆసుపత్రి ప్రసవాలు, కుటుంబ నియంత్రణ తదితర లక్ష్యాల షరతులతో కూడిన నగదు బదిలీలు మరింత ప్రయోజనాన్ని సాధిస్తాయి. ఏమైనా షరతులతో కూడిన సమగ్రమైన నగదు బదిలీల పై ప్రభుత్వం దృష్టిపెట్టకపోతే ఏ ప్రయోజనం సిద్ధించదు. ◆

## తుప్పపట్టడం కంటే అరిగిపోవడమే మేలు

**మరణం అనివార్యమైతే ఎండిన చెట్టు మోడులాగో, రాతిబండలాగో నశించిపోవడం కంటే వీరోచితంగా మరణించడమే కోరతగినది. తాత్కాలికమైన ఈ భౌతిక జీవితంలో మరో రెండు రోజులు ఎక్కువగా బతికినంత మాత్రాన కలిగే ప్రయోజనం ఏమీలేదు. *ఏదైనా పరికరం తుప్పపట్టి పనికి రాకుండా పోవడం కంటే, అరిగి పోయి నశించిపోవడం మేలు.* అదే విధంగా ఏమీ చేయకుండా ఊరికేజీవించడం కన్నా పరుల మేలుకోసం కొద్ది సహాయమైనా చేస్తూ మరణించడం మంచిది. శరీరంలో చేవలేక, హృదయంలో ఉత్సాహం శూన్యమై, స్వతంత్ర ఆలోచన కరువైన నిర్జీవ మాంసపిండాల వల్ల ప్రయోజనం శూన్యం. అలాంటివారిని ఉత్తేజపరచి జీవచైతన్యం వెలిగించడమే నా సంకల్పం.**



స్వామి వివేకానంద

# సమీక్షణాత్మక గ్రంథం

ఈ జగంలో సగం ఆమె. పాలిచ్చి మురిపాలిచ్చి పెంచే ఆమెకు పరిపాలించే విషయంలో అవరోధాలెందుకో అర్థం కాదు. స్వాతంత్ర్యం వచ్చి ఆరున్నర దశాబ్దాలు పూర్తి అవుతున్నా, రాజకీయాలలో మహిళల రాణింపు అంతంత మాత్రమే. ఇదిగో మహిళా బిల్లు, అదిగో మహిళా బిల్లు అంటూ ఓట్లమాటు రాజకీయాలతో బిల్లు తూట్లు పొడుస్తున్నారు. స్వామి వివేకానంద చెప్పినట్టు మహిళలకు సముచిత సాధనం దక్కినప్పుడు మాత్రమే, వాళ్ల సమస్యలని వాళ్లు పరిష్కరించుకోగలుగుతారు. మహిళా సాధికారత సాకారమైనప్పుడు మాత్రమే సంస్కృతి, ప్రజ్ఞాపాటవాలు, ఈ సమాజంలో పరిఢ విల్లుతాయి అటువంటి వారి పెంపకంలో పిల్లలు ఉత్తమ పౌరులుగా రూపొందుతారు. అయితే మహిళా సాధికారతకు, అడుగడుగునా సైంధవులే. అయినప్పటికీ, రాజకీయాలలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఎన్ని అవరోధాలు వచ్చినా, అన్నిటినీ అధిగమిస్తూ మును ముందుకు సాగుతున్నారు. పలువురు మహిళలు.

ముఖ్యంగా మన రాష్ట్రంలో, అటువంటి మహిళా శిరోమణుల గురించి, పరిశోధనాత్మకంగా యీ పుస్తకంలో అందించారు, షేక్ హసీనా.

'హసీనా షేక్' నిజ జీవన విష కషాయాన్ని సైతం చిరు దరహాసంతో స్వీకరించే సాక్షర సాధికార మహిళాధీర. 'కమ్యూనికేషన్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ రూరల్ విమెన్' అనే జటిలమైన అంశం మీద పి.హెచ్.డి. చేస్తున్న వీరు దశాబ్దకాలంగా ప్రింట్ మీడియాలో, కవయిత్రిగా, రచయిత్రిగా, వ్యాసకర్తగా, ఎలక్ట్రానిక్ మీడియాలో రిపోర్టర్ స్థాయి నుంచి సీనియర్ ప్రొడ్యూసర్, ఇంచార్జ్ హోదాకి ఎదిగిన అక్షర ప్రహార హసీనషేక్.

ఆమెకు 'మహిళాసాధికారత' ఒక వినోదంకాదు. రాజకీయ నినాదం అసలుకానే కాదు. ఆమె దృక్పథంలో మహిళా సముద్ధరణ విషయంలో ఎలాంటి వివాదాలకి చోటు లేదు. కనుకనే, త్రికరణశుద్ధితో ఆమె గ్రామీణ మహిళల జీవితాల లోతుపాతులని కూడా తరచి చూడగలిగింది. రాజకీయాలలో మహిళలు అనే అంశాన్ని ఒక పుక్కిటి పురాణంలా కాక, శాస్త్రీయ దృక్పథంతో, సంఖ్యా వివరాలతో సహా విశ్లేషించ గలిగింది. అలా పరిశోధనాత్మకమైన, తన పరిశ్రమలో కృతకృత్యురాలు కాగలిగింది.

రాజకీయాలలో మహిళలు గురించి సమగ్రమైన నివేదిక వంటి వివరణ యిస్తూనే, వివిధ రంగాల భారతీయ మహిళామణుల గురించి సంక్షిప్తంగా వివరించగలిగింది. అలా, తను ఎన్నుకున్న ఇతివృత్తానికి సంపూర్ణత సంతరించు కోగలిగింది.

పాత్రికేయ ప్రపంచంలో ఎంతటి సంచలనాత్మక వార్తలయినా, మరుక్షణంలోనే పాతవిలా చల్లబడిపోతాయి. సంవేదనా భరితమైన వ్యాసాలు కొంతకాలం పాఠకుల మనుసులని కదిలిస్తాయి. సద్విమర్శనాత్మకమైన రచనలు చదువరులకి కనువిందు కలిగిస్తాయి. సమాజిక సహణీయమైన కవితలు సమాజంలో చైతన్య స్ఫూర్తి రేకెత్తిస్తాయి. ఆ కోవలోకే వస్తాయి. హసీనాషేక్ అసంఖ్యాక రచనా విన్యాస విధానాలు.

'మహిళాసాధికారత' విషయంలో విశ్వకీర్తి శిఖరాలని

## స్వీకారం

**రాజకీయాలలో మహిళలు**

రచయిత: **షేక్ హసీన**

haseen.honey@yahoo.com

**వెల : 100/-**

**ప్రతులకు :**

ప్రజాశక్తి బుక్‌హౌస్

విశాలాంధ్ర బుక్‌హౌస్



అధిరోహించిన పూర్వ భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ, ప్రస్తుత కాంగ్రెస్ అధ్యక్షురాలు, యు.పి.ఏ. ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ, పాకిస్తాన్ పూర్వ ప్రధాని బెనజీర్ భుట్టో, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, మయన్మార్ విప్లవాధినేత్రి సూకీ, యు.ఎస్.సెక్రటరీ ఆఫ్ స్టేట్ లారా క్లింటన్ వంటి జగద్విఖ్యాతల నామధేయాలు పుటంకించడమే. మన రచయితలకి పరిపాటి అయిపోయింది.

కాని, కాలగర్భంలో కలిసిపోయిన తమ సూక్ష్మ శరీరాలతో విరాజిల్లే భారత కవికోకిల సరోజినీ నాయుడు, రోగార్తుల అంధకారబంధురమైన జీవితాలలో చేతిలో లాంతరుతో చేతలలో కారుణ్యంతో ఆశల వెలుగుజిలుగుల నింపిన ఫ్లారెన్స్ నైటింగేల్ ఆఫ్ ఇండియా తెరమరుగున పడిన మహానటీమణులు వివరాలని సైతం తన పుస్తకంలో సంక్షిప్తీకరించిన 'అక్షర సాధికార' షేక్ హసీనా.

పుటలు వేగంగా తిరగేస్తున్నామనే స్పృహ కూడా లేకుండా చదువరులని ఆకట్టుకునే హైడెగ్రీ ఆఫ్ రీడబిలిటీ షేక్ హసీనా స్వంతం. సృజనాత్మకమైన రచనా తపనా భరితం ఆమె స్వంతం. రచనే పరమావధిగా కొనసాగుతుంది, ఆమె జీవనా స్వాంతం. ఆమె రచనలు సహస్రాదికంగా వెలువడాలని తెలుగువాఙ్మయం. భువన భవనాన్ని అక్షరదీపాలతో వెలిగించాలనీ ఆకాంక్షిస్తూ... నిండుమనసుతో సోదరి షేక్ హసీనాని ఆశీర్వదిస్తున్నాను. ◆

**పి.విజయబాబు**

సంపాదకులు, ఆంధ్రప్రభ




# సురాజ్య ఉద్యమం కొన్ని నినాదాలు

**కొందరి స్వార్థం కోసం స్వాహారాజ్యం - అందరి బాగుకోసం సురాజ్యం**

**రాయితీల బతుకుల కన్నా - ఎదిగే అవకాశాలే మిన్న**

**స్వాహారాజ్యం కూలుద్దాం - సురాజ్యం నిర్మిద్దాం**

**అవినీతి అంతం - లోక్‌సత్తా పంతం**

**ప్రభుత్వ సేవలలో లంచాలు పోవాలి - హక్కుగా ప్రజలకు సేవలందాలి**

**కొత్త లోకాయుక్త రావాలి - అవినీతి భరతం పట్టాలి**

**చెడ్డ రాజకీయాన్ని తుంచు - మంచి రాజకీయాన్ని పెంచు**

**నీతిపరులకి అధికారం - అవినీతిపరులకి కారాగారం**

**నిజాయితీకి పట్టం కడదాం - అవినీతికి గోరీ కడదాం**

**ప్రతి ఓటుకీ ప్రాతినిధ్యం - దామాషా పద్ధతితోనే సాధ్యం**

**ధన రాజకీయం పోవాలి - జన రాజకీయం రావాలి**

**ప్రజలే ప్రభువులు - పాలకులు సేవకులే**

# సురాజ్య ఉద్యమ పాట

**పి. సాంబశివరావు,** గుంటూరు

ప : ఉద్యమం ఉద్యమం సురాజ్య ఉద్యమం
మండుతున్న గుండెలెన్నో గొంతెత్తిన ఉద్యమం
అవినీతికి నీతికి మధ్య సాగే విప్లవ ఉద్యమం
మొదలయ్యింది నేడే లోక్‌సత్తా జెండా ఊపినఉద్యమం
॥ఉద్యమం॥

చ:-1 తెల్లదొరల పాలనంతా దుర్మార్గంతో సాగెరా
ఆనాడే అవినీతికి బీజాలు పడ్డాయిరా
ఆ దొరల పాలనెప్పుడో అంతరించిపోయినా
నాటి అవినీతి బీజం నేడు విషవృక్ష మాయెరా
ఆ వృక్షాన్నే పెకలించుదాం కదలిరండిరా
ఓ విద్యార్థి యువజనులారా భావితరం మీదిరా
అంకురమైన ఉద్యమాన్ని మీదిగ భావించండిరా
॥ఉద్యమం॥

చ:-2 గాంధీ చేపట్టింది సత్యాగ్రహ ఉద్యమం
సుభాష్ చంద్రబోసుదేమో విప్లవ ఉద్యమం
అల్లూరి చేశాడు తిరుగుబాటు ఉద్యమం
నాటి ఉద్యమాలు తెల్లదొరల మీద అయితే
ఈనాటి ఉద్యమం నల్లదొరల అవినీతిపైనరా
చూస్తూ కూర్చుంటే ఈ మలినం ఎన్నటికీ పోదురా
అవినీతి భూతాన్ని మనమే అంతమొందించాలిరా
॥ఉద్యమం॥

చ:-3 జోడించిన చేతులతో పెద్దలకు నమస్కరిస్తున్నాం
మా ఉద్యమానికి మీ సాయం కోసం అర్థిస్తున్నాం
మీ ఇంటి బిడ్డనొక్కడిని ఈ ఉద్యమానికి ఇవ్వమని
గడగడపకు ఒక్కరైన కదలి వచ్చిన నాడే బలం పెరిగే ఉద్యమం
ఊపు అందుకుంటుందిరా
అవినీతిపరుల గెండెలోన ఫిరంగులు మోగించాలిరా
అప్పడే మనకు చెప్పకుండ ఈ భూతం పారి పోతుందిరా
॥ఉద్యమం॥

# లోక్‌సత్తా పార్టీ పాట

ప : లోక్‌సత్తా దండు గదిలిందో అవినీతిపరుల
గుండెలల్లో జల్లుబట్టిందో అవినీతిపరుల

చ :-1 రాజ్యాంగములోన ఉన్న రాజనీతిని అమ్ముకొనెడి
లంచగొండుల గుండెలల్లో బాంబులయ్యి పేలుతున్న
కత్తి గన్ను లేకున్నా కలము పోటును నమ్ముకోని
మాటలే తూటాలు చేసి యుద్ధమునకు సిద్దమైన
జెపి గారి గుండెబలముకో అవినీతిపరులు
గుండెలదిరి గుటుకు మంటున్రో అవినీతిపరులు
॥లోక్‌సత్తా॥

చ :-2 భారతీయులకందరికి బ్రహ్మాస్త్రంబయ్యినట్టి
సమాచార హక్కు చట్టము సాధించి చేతికిచ్చిన నేరచరితుల
చిట్టలన్నీ బట్టబయలు చేసినట్టి
పిట్టలాంటి బక్కమనిషి ఒక్కడేమిజెస్తడంటే
అవినీతి బిల్లుబట్టిండో ఆ బక్క మనిషి
అలుపులేని పోరుజేస్తుండో ఆ బక్క మనిషి ॥లోక్‌సత్తా॥

చ :-3 చెమటచుక్కతో నేల తడిపి దుక్కిదున్ని పంట దీస్తే
డొక్క నిండని బక్క రైతు ఎక్కి ఎక్కి ఏడుస్తుంటే
దళారీలను సాగనంపి ఎవరిపంట వారు దెచ్చి
ఎక్కడైన అమ్ముకొనేడి స్వేచ్ఛ మాకూ ఇవ్వమంటూ
రైతు సత్యాగ్రహము చేస్తుందో మన లోక్‌సత్తా
లాభసాటికి పోరు చేస్తుందో మన లోక్‌సత్తా ॥లోక్‌సత్తా॥

చ :-4 నాణ్యమైన ఉచిత విద్య, ఉచిత వైద్యము, ఉపాధియే
దేశ ప్రగతికి ముఖ్యమంటూ బల్లగుద్ది చాటి చెప్పిన
జిల్ల జిల్లకు గ్రామమునకు ప్రభుత్వాలేర్పాటు చేసి
ప్రజలు నిధులు ప్రజలకిచ్చి ప్రజల చేతికి పాలనిచ్చి ఏలుకొమ్మని
చాటి చెబుతుందో మన లోక్‌సత్తా
ఎదురు చూడక బతకమంటుందో మన లోక్‌సత్తా
॥లోక్‌సత్తా॥

చ :-5 గాంధీజీ మార్గమందు అంబేద్కర్ ఆశయాలను
అమలు చేయుట ధ్యేయమంటూ సర్వ జనులకు స్తానమిచ్చి
ప్రజాస్వామ్య పద్ధతిలో సామాజిక న్యాయమునకై
పుట్టుకతో వివక్ష లేని విలువలతో జీవించమంటూ సర్వజనుల
సత్తా బెట్టిందో మన లోక్‌సత్తా
సర్వజనులను కదలిరమ్మందో మన లోక్‌సతా ॥లోక్‌సత్తా॥

చ :-6 పేదవాడి వోటు దోచే ఉన్నవాడి నోటు చించి
మంచి పాలనకై నిలిచిన నీతిమంతులకోటు వేసి
చెడ్డవారి చెడుపుకంటే మంచివారి మౌనమెంతో ప్రమాదంబని
తెలియజెప్పి కదిలిరండని పిలుపునిచ్చి పాలకులను
మార్చుకోమ్మందో మన లోక్‌సత్తా
పరిపాలన చేసుకోమ్మందో మన లోక్‌సత్తా ॥లోక్‌సత్తా॥

**- పగడాల వెంకటేశ్వరరావు**

# పట్టణాలలో సురాజ్య ఉద్యమ నగార



## స్వాహా రాజ్యం కూలుద్దాం... సురాజ్యం నిర్మిద్దాం...




కర్నూలులో రౌండ్‌టేబుల్

స్థానిక అంబేద్కర్ భవనం ముందు ఆవరణలో ''సురాజ్య ఉద్యమ'' సమన్వయ కమిటీ ఎన్.జి.శంకర్, ఎ.ఆర్.కె. డేవిడ్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశం నందు జన విజ్ఞాన వేదిక, జనచైతన్య సంఘం, సమాచార హక్కు ఐక్యవేదిక, అఖిలభారత యువజన సమాఖ్య, తెలుగు బాషా వికాస ఉద్యమం, ప్రజాపౌర వేదినీ, సీనియర్ సిటిజన్ ఫోరం, మహిళాసత్తా, ఎన్.జి.ఓ సంఘం, మరియు పురప్రముఖులు, విశ్రాంత ఉద్యోగస్తులు, పరమేశ్వర ఎడ్యుకేషన్ సొసైటి వారు మరియు ప్రజాసంఘాల నాయకులు అందరూ కలసి సురాజ్య ఉద్యమాన్ని నిర్వహించాలని ప్రతిజ్ఞ చేసారు. ఈ ఉద్యమం సురాజ్య ఉద్యమం నిర్వహణకు పట్టణ కమిటీ ఏర్పాటయింది. రాష్ట్ర కార్యదర్శి కె.ఓంకార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**సురాజ్య ఉద్యమ కార్యచరణకమిటీ :** 1. గౌరవ అధ్యక్షులు శ్రీ బి.ఎన్.చెట్టి, సీనియర్ సిటిజన్ ఫోరం. 2. అధ్యక్షులు శ్రీ ఎమ్. రామకృష్ణారెడ్డి వ్యవసాయచైతన్య సంఘం. 3. ఉపాధ్యక్షులు శ్రీ రత్నారెడ్డి, గోవిందరావు, అనిల్‌కుమార్, రాజ్యలక్ష్మి, సోమశంకరయ్య, వేమారెడ్డి. 4. జిల్లా సమన్వయ కర్త ఎన్.జి.శంకర్. 5. జిల్లా కార్యదర్శి ఎ.ఆర్.కె.డేవిడ్. జిల్లా సహాయకార్యదర్శి శేషగిరి.

**ఉద్యమ కార్యవర్గ సభ్యులు :** 1.జయన్న (సమాచార హక్కు పరిరక్షణ జిల్లా కార్యదర్శి) 2. షేక్‌షావలి (Jvv) 3. పి. రామకృష్ణారెడ్డి (Aiyf) 4.శివనాగిరెడ్డి (జనవిజ్ఞాన వేదిక) 5. ఎమ్. మల్లీకార్జున (పౌరవేదిక) 6. శ్యామసుందర్‌రెడ్డి (పౌరవేదిక) 7. అయూబ్ (యువత)

**జిల్లా సలహా కమిటీ :** 1. తెలుగు భాషాసంఘం అధ్యక్షులు శ్రీ జె.యస్.ఆర్.కె.శర్మ. 2. హీరాలాల్ సభ్యుల సమక్షమున ఎన్నుకోవడం జరిగింది. సురాజ్య ఉద్యమం తదుపరి కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా ఈ కమిటీ సమక్షంలో జరుగును.

# సుపరిపాలనే సురాజ్య ఉద్యమ లక్ష్యం

**పటిష్ట లోక్‌పాల్ బిల్లుతోనే అవినీతి అంతం'**



## శ్రీకాకుళం

పటిష్ట లోక్‌పాల్ బిల్లుతోనే అవినీతిని అంత మొందించగలమని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.పోలినాయుడు అన్నారు. 'సురాజ్య' ఉద్యమాన్ని చేపట్టిన సందర్భంగా శ్రీకాకుళం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లోకాయుక్త, జిల్లాల్లో అంబుడ్స్‌మెన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు బరాటం కామేశ్వరరావు మాట్లాడుతూ అవినీతి అంతానికి సురాజ్య పోరాటం కొనసాగాలని, ఇందులో అందరూ పాల్గొనాలని కోరారు. మహాత్ముడు ఆశించిన సురాజ్యం రావాలన్నారు. ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి మాట్లాడుతూ సురాజ్య ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లేందుకు అందరూ సహకరించాలన్నారు. ప్రధాన ఆదినారాయణ మాట్లాడుతూ అందరూ కలిసి పోరాడితేనే అవినీతిని అంతమొందించగలమని చెప్పారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బి.మోహనరావు మాట్లాడుతూ ఈ ఉద్యమానికి యువత నాయకత్వం వహించాలన్నారు. అంతకుముందు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి సురాజ్య ఉద్యమ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో యువసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాది రాంబాబు, లోక్‌సత్తా ఉద్యమ కన్వీనర్ బి.సుర్యారావు, ఓంశాంతి ప్రతినిధి కె.ఎల్.నాయుడు, సంఘ సేవకుడు కె.వెంకట్రావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.ఫ్రెడరిక్, గార నారాయణరావు, వి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి అంతమే సురాజ్య ఉద్యమ లక్ష్యం

## ఆమదాలవలస

అవినీతి అంతమే సురాజ్య ఉద్యమ లక్ష్యమని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు కె.పోలినాయుడు అన్నారు. స్థానిక ఎస్ఎస్ఎన్ కల్యాణ మండపంలో ఆమదాలవలస సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు జె.జె.మోహనరావు ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రోటరీక్లబ్ సభ్యులు ఏర్పాటుచేసిన సురాజ్య ఉద్యమం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సమాజమంతా అవినీతి కూపంలో కూరుకుపోయిందని, భవిష్యత్తు తరాలకోసం సురాజ్య ఉద్యమం ద్వారా పోరాటాలు సాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు జె.జె.మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుత పాలనలో అధికారులు, ప్రజాప్రతినిధులు దండుకోవడమే తప్పా ప్రజల సమస్యలు పట్టించుకునేవారే కరువయ్యారని ఆయన విమర్శించారు. సూర్య, మవిన స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు రమణమూర్తి, సన్యాసప్పారావు మాట్లాడుతూ సమాజాభివృద్ధి ఒకరివల్ల కాదని అందరూ సహకరిస్తేనే సాధ్యమవుతుందన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బోడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులే అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కింతలి చంద్రరావు, లోక్‌సత్తా నియోజక వర్గ కన్వీనర్ తమ్మినేని అన్నంనాయుడు, లోక్‌సత్తా పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, యూటిఎఫ్

మండలప్రధాన కార్యదర్శి నారాయణరావు, బ్రాహ్మణ సంఘం మండల మాజీ అధ్యక్షుడు రమణమూర్తి, జి.వి.ఆర్.కె.శర్మ, మురళి, రాంబాబు, వెంకటేశ్వర్లు, జగదీష్‌లతో పాటు వివిధ సంఘాల నాయకులు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు, రోటరీక్లబ్‌సభ్యులు, సిటిజన్స్ ఫోరం సభ్యులు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నియోజకవర్గస్థాయి సురాజ్య ఉద్యమకమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షునిగా పూజారి రమణమూర్తి, కార్యదర్శిగా పేడాడ సన్యాసప్పారావు, ఉపాధ్యక్షునిగా గురుగుబెల్లి సత్యనారాయణ, కోశాధికారిగా వాకముళ్ల రమణమూర్తి, గౌరవాధ్యక్షునిగా జె.జె.మోహనరావు, కమిటీ సభ్యులుగా రమణమూర్తి, కింతలి త్రినాథరావు, బగాది భాస్కరరావు, అంపోలు ధర్మారావు, బొడ్డేపల్లి మోహనరావు, టి.వి.ఆచార్యులుతో పాటు మరికొందరు సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ ఎన్నిక లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు పోలినాయుడు, అమదాలవలస సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు మోహనరావు ఆధ్వర్యంలో జరిగింది.

# 'సురాజ్యం' లో సినీ నటుడు కళ్లు చిదంబరం



లోక్‌సత్తా అధినేత డా॥జయప్రకాష్‌నారాయణ్ ప్రారంభించిన సురాజ్య ఉద్యమానికి తన వంతు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నానని ప్రముఖసినిమా నటుడు కళ్లు చిదంబరం తెలియజేశారు. పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు భీశెట్టి బాబ్జీని కలసి తన మద్దతు ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో రాజకీయ పార్టీల తీరుచూస్తే రోతపుడు తుందని అలాగని తిట్టుకొని కూర్చునే కంటే రాజకీయాల మార్పుతో సమాజ అభివృద్ధి కోరుకునే లోక్‌సత్తా పార్టీ అధినేత డా॥జయప్రకాష్‌నారాయణ్ పడుతున్న తపనకు తన మద్దతు ప్రకటించి సురాజ్య ఉద్యమంలో భాగం కావాలని తనే కార్యాలయానికి వచ్చానని ఆయన తెలిపారు. రాష్ట్రంలో సురాజ్య పోరాటానికి మద్దతు ప్రకటించిన చుక్కరామయ్య ఎస్.ఎస్.రాజమౌళీ, ఎమ్మెల్సీ నాగేశ్వర్, తమ్మారెడ్డి భరద్వాజా, సిరివెన్నెల సీతారామశాస్త్రి లాంటి వారితో కలసి తనవంతు సహకరిస్తానని కార్యకర్తలకు హామీ నిచ్చారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ అన్ని స్థాయిల్లోని అవినీతిని అడ్డుకొనేందుకు యువత కృషి చెయ్యాలని నటులు చిదంబరాన్ని ఆదర్శంగా తీసుకొని నగరంలో ప్రముఖులు సురాజ్య పోరాటానికి మద్దతు ప్రకటించాలని భీశెట్టి కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నాయుడు వేణుగోపాల్, దాసరి శ్రీనివాస్, డి.జోయ్, శిరిపురపు శ్రీనివాస్, బొడ్డుశ్రీనివాస్, రామ్మోహన్, హరిబాబు, మూర్తి చిప్పాడ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖపట్టణం

## లోక్‌సత్తా సురాజ్యఉద్యమం

అవినీతికి వ్యతిరేకంగా లోక్‌సత్తా ఈ నెల 9 నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో సురాజ్య ఉద్యమం చేయనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ప్రకటించారు. అంబేద్కర్ విజ్ఞాన మందిర్ శ్రీకాకుళం జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ లోక్‌సత్తా ఉద్యమ సంస్థ, వివిధ ప్రజా సంఘాలు, మేధావులు, ప్రముఖులతో సురాజ్య ఉద్యమాన్ని సాగిస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఉద్యమాన్ని సాగించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు కె. పోలినాయుడు మాట్లాడుతూ ప్రస్తుత ప్రజాస్వామ్య వ్యవస్థలో నీతికి అర్థం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పంచాది రాంబాబు, జిల్లా కార్యదర్శి బి.జగదీష్, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జన చైతన్యంతోనే సురాజ్యం






**రామచంద్రపురం**

ప్రజలను చైతన్యవంతం చేసి వారి ఆలోచనల్లో మార్పు తీసుకొచ్చినప్పుడు సురాజ్య లక్ష్యాలు అందుకోవచ్చని లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.డి.రామారావు అన్నారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో స్థానిక మోడరన్ కళాశాలలో జరిగిన సురాజ్య ఉద్యమం చర్చావేదికలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సురాజ్యం కోసం ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తే ఖచ్చితంగా మార్పు వస్తుందన్నారు. గుండె నిండా ఆశ నింపుకొని సురాజ్య సాధనకు ప్రయత్నం చేద్దామన్నారు. ప్రస్తుత రాజకీయ పార్టీలన్నీ వారసత్వ డబ్బు, కులంతో నిండి ఉన్నాయన్నారు. రాజకీయ వ్యవస్థను, ఎన్నికల వ్యవస్థను సంస్కరణ చేసినప్పుడే అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ తమ ఆదాయ వనరులను ప్రకటించినట్లుగానే మిగిలిన అన్ని రాజకీయ పార్టీలూ ప్రకటించాలని సూచించారు. ప్రజల్లో ప్రశ్నించే తత్వం పెరిగినప్పుడే ప్రభుత్వం తమ బాధ్యతను కచ్చితంగా నిర్వర్తిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాన్యుని వద్దకు ఉద్యమాన్ని విస్తరించాలన్నారు.

ఈ కార్యక్రమానికి లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి మాచిరాజు అధ్యక్షత వహించారు. గరిగిపాటి సూర్యనారాయణ, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎన్.సుబ్బారావు, మోడరన్ అధినేత జి.వి.రావు, మాగాపు అమ్మిరాజు, దేవరపల్లి రామకృష్ణ, అరవ విశ్వేశ్వరరావు, వేక సుబ్బారావు, సి.వి.వి. సత్యనారాయణ, ఎం.వి.రమణమూర్తి, బి.వి.బి.ఎల్. నారాయణ తదితరులు చర్చావేదికలో పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. చివరిగా సురాజ్య స్థాపనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## గాజువాకలో ‘సురాజ్యం’ ప్రతిజ్ఞ



స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా గాజువాక లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం ఇన్‌చార్జీ శ్రీ.జి. ఆనంద్, బీహారీలాల్ మరియు లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో లోక్‌సత్తా పార్టీ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, మహిళాసత్తా ఇన్‌చార్జి మరియు కార్యకర్తలు, యువసత్తా కార్యకర్తలు, పార్టీ అభిమానులు సమావేశమై స్వాతంత్ర్యదినోత్సవ కార్యక్రమము మరియు సురాజ్య ఉద్యమం దీక్ష ప్రతిజ్ఞ కార్యక్రమము వేడుకగా జయప్రదం చేశారు. కార్యక్రమములో వక్తలు పార్టీ ఆశయాలు, కార్యక్రమాలు ప్రజలను చేరువగుటకు వారి వారి సూచనలు ఇచ్చారు. స్వాతంత్ర్య ఉద్యమం స్ఫూర్తితో “సురాజ్య ఉద్యమాన్ని నడిపిస్తామని ప్రతిజ్ఞ చేసారు. యువతీ,యువకులు అధికముగా పాల్గొని ఉద్యమ స్ఫూర్తికి నాంది పలికారు.

# 'ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళించాలి'




## అవినీతి రహిత సమాజమే లక్ష్యం

దేశంలో అవినీతిరహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని జిల్లా ఎకానమిక్స్ ఫోరం అధ్యక్షుడు నేదునూరి కనుకయ్య పిలుపునిచ్చారు. లోక్‌సత్తా సురాజ్య ఉద్యమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా అవినీతి వేళ్లూనుకుపోయిందన్నారు. దాన్ని కూకటి వేళ్లతో పెకిలించి అవినీతి రహిత సమాజాన్ని నిర్మించేందుకు విద్యార్థులు నడుం కట్టాలని పిలుపునిచ్చారు.

ప్రముఖ న్యాయవాది, వినియోగదారుల సంఘం రాష్ట్ర నాయకుడు శాంతిప్రకాశ్‌శుక్లా మాట్లాడుతూ అవినీతిని అంతమొందించేందుకు అందరూ కలిసి కట్టుగా కృషి చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయన్నారు. లోక్‌సత్తా తీసుకున్న సురాజ్య ఉద్యమం ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ కవి జనపాల శంకరయ్య, గెంట్యాల భూమేశ్, డాక్టర్ బంగారు దశరథం, రామరాజు, లోక్‌సత్తా డివిజన్ కన్వీనర్ గెంట్యాల జయంత్‌కుమార్, వెంగళ అంకయ్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**సిరిసిల్ల**

## 'ఎన్నికల వ్యవస్థను ప్రక్షాళించాలి'

మంచి వారికి ఓటు వేసిన వారు గెలువకపోవడం వల్ల ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతున్నదని లోక్‌సత్తా పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు శాంతి ప్రకాష్‌శుక్ల అన్నారు. లోక్‌సత్తా సురాజ్య ఉద్యమంలో భాగంగా ఎన్నికల వ్యవస్థపై సమావేశం నిర్వహించింది. సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో లోక్‌సత్తా నియోజకవర్గ కన్వీనర్ గెంట్యాల జయంత్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భారతదేశంలోని ఎన్నికల వ్యవస్థపై ఎస్పీ శుక్ల మాట్లాడుతూ ఒక ఓటు ఎక్కువగా వచ్చినా గెలిచే అవకాశం ఉండడం, రాజకీయ పార్టీలు మంచి వ్యక్తులు కాక గెలిచే అభ్యర్థులకై అన్వేషించడం, సమాజహితం కోరే వారి కంటే గెలిచే అభ్యర్థులనే కీలకంగా భావిస్తున్నారని అన్నారు. పార్టీలు ధనబలం, కండబలం ఉన్న అభ్యర్థుల పట్ల మొగ్గుచూపడం, వేసే ప్రతి ఓటుకు చట్ట సభలో ప్రాతినిధ్యం లేకపోవడం, గెలుపు ఓటములు నియోజకవర్గ ప్రాతిపదికన తేలే అవకాశం ఉండడం, ఓడిన వారికి వేసిన ఓట్లు వృధా అనే భావన కలగడం, ఏ అభ్యర్థి ఎక్కువగా డబ్బులు ఖర్చుపెడితే వారు గెలుస్తామనే భావన ఉండడం మొదలైన కారణాల వల్ల ఎన్నికల పట్ల ఏహ్య భావం కలుగుతున్నదని ఆరోపించారు. ఈ విధానం మారినప్పుడే ఎన్నికల వ్యవస్థ ప్రజలకు నిజమైన ప్రజా ప్రతినిధులను అందించి మంచి పాలన అందిస్తుందని శుక్ల అన్నారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కో– కన్వీనర్ మోర శ్రీనివాస్, సెస్ ప్రతినిధి గూడూరి భాస్కర్, సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షులు బియ్యంకార్ శ్రీనివాస్, లోక్‌సత్తా నాయకులు వెంగళ అంకయ్యలు పాల్గొన్నారు.

# సుపరిపాలన లక్ష్యంగా 'సురాజ్యం

**శ్రీకాళహస్తి**



స్వాహా రాజ్యానికి చరమగీతం పాడుతూ... సురాజ్య స్థాపన ఏర్పాటుకు లోక్‌సత్తా, యువసత్తా పోరాడుతుందని నేతలు అన్నారు. సుపరిపాలన లక్ష్యంగా చేపట్టిన సురాజ్య ఉద్యమాన్ని జిల్లాలో మొదటిసారిగా శ్రీకాళహస్తి పట్టణంలో చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కొత్త రాజకీయ సంస్కృతి, అవినీతి అంతం, అందరికీ ఎదిగే అవకాశం, అందరికీ ఒకే న్యాయం, ఇంటి ముంగిట ప్రభుత్వం, కంటిముందు పాలన వంటి సురాజ్య లక్ష్యాలని తెలిపారు. జాతీయ స్థాయిలో లోక్‌పాల్, రాష్ట్రస్థాయిలో లోకాయుక్త, జిల్లా స్థాయిలో అంబుడ్స్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని, ఎన్నికల్లో దామాషా పద్ధతిని ప్రవేశపెట్టాలని కోరారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. వంద మీటర్ల జాతీయ జెండా నీడన విద్యార్థులు సురాజ్యం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు విజయకిరణ్ లోకేష్‌బాబు, మునిరత్నం, మధు, గిరీష్, శరత్, మహేష్, అరుణ్, వినోద్, హరి, శశికుమార్, షబ్బీర్, అఫ్రోజ్, రాజేష్, నేరు, బత్తినయ్య, వెంకటరమణ, చిరంజీవి,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సురాజ్యమే నిజమైన స్వరాజ్యం

**భీమవరం**




ఆగస్టు 15, 2012 తేదీన భారతదేశ 66వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని భీమవరం లోక్‌సత్తా పార్టీ కార్యాలయములో పట్టణప్రముఖ లాయర్ శ్రీ మంతెన రామలింగరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం లోక్‌సత్తా పార్టీ పతాకమును జిల్లా అధ్యక్షులు శ్రీజి.జానకిరామరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జి. నరసింహ రాజు లాయరు, కె.కృష్ణ మోహన్, ఎస్.జానకి రామరాజు, అల్లూరి సీతారామరాజు మరియు యువసత్తా నాయకులు బి.హెచ్.ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులను స్మరించి నివాళులు అర్పిస్తూ, అవినీతి వ్యతిరేకపోరాటమైన ''సురాజ్య ఉద్యమములోనికి'' పట్టణములో ఉన్న విద్యార్థియువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పార్టీ అనుబంధ సంఘాలు కలసిరావాలని కోరారు.

అనంతరం పార్టీ కార్యాలయం నుండి నినాదాలుచేస్తు, జువ్వలపాలెం రోడ్ మీదుగా ప్రకాశంచౌక్ గుండా, తాలూకా కార్యాలయం వద్ద గల గాంధీ విగ్రహం వద్దకు చేరి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భీమవరం పట్టణంలో "సురాజ్య ఉద్యమం'' ప్రారంభిస్తూ తేది: 9-08-2012 క్విట్ ఇండియా ఉద్యమరోజు నుండి అంతర్జాతీయ వ్యతిరేకదినం వరకు తేది 09-08-2012 వరకు కొనసాగించాలని నియోజకవర్గ అధ్యక్షులైన ఎ.సీతారామరాజుగారు కోరారు. తదుపరి స్వరాజ్య ఉద్యమ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమములో పార్టీ నాయకులు పి.భీమరాజు, కఠారి రవిశంకర్, ఎమ్.కృష్ణంరాజు, డి.విజయబంగార్రాజు, బి.వెంకటపతిరాజు, ఓంకారవర్మ, కె.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎదిగే అవకాశాల కోసం సురాజ్య ఉద్యమం




నంద్యాల

అవినీతి రహిత పాలన కోసం అందరూ సమానంగా ఎదిగే అవకాశం కోసం, విద్య, వైద్యం, ఉచితంగా ప్రతి ఒక్కరికి అందజేయడంకోసం సురాజ్య ఉద్యమాన్ని స్థానిక ఎమ్.ఆర్.ఓ కార్యాలయం నుండి సురాజ్య ఉద్యమ కార్యకర్తలు మోటర్‌సైకిళ్ళ పై జాతీయ జెండాలను చేతబూని గాంధీ చౌక్ వరకు ర్యాలీగా వెళ్ళి రైతు నాయకులు శంకర్‌రెడ్డి, రిటైర్డ్ డి.ఆర్.ఓ, రాజారామోహన్‌రావు జె.వి.వి.నేత, డా॥నాగరాజు, బహుజనపార్టీ నేత, నారాయన్ యూత్ నాయకులు, అల్తాహుస్సెన్‌లు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేసారు. సురాజ్య ఉద్యమంలో భాగంగా మీ సేవ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ జరుగుచున్న సేవల గురించి మేనేజర్‌ని అడగగా, ఇంకా మీ సేవ ప్రారంభం కాలేదు. ప్రస్తుతము ఈ సేవ మాత్రమే ఉంది. మీసేవ బోర్డులు తగిలించి నెలరోజులు దాటినా ఇంకా మీ సేవా కార్యక్రమాలు మొదలు కాలేదు నిస్సహాయతగా ఉండిపోయినారు. ఈ కార్యక్రమంలో యస్.ఎ మజీద్, ఎన్.ఎ. హమీద్ ప్రధానకార్యదర్శి ఎమ్.వి. సత్యనారాయణ, డా॥శేషారెడ్డి, డా॥రాముడు, పి.ఎన్.క్రిష్ణ, వెంగళరెడ్డి, దాసయ్య, విజయ్‌కుమార్, ఆర్.కె.చైతన్య, ప్రభాకర్, హరిప్రసాద్ రెడ్డి, ఇక్బాల్, ఫణీంద్ర, ప్రవేటుస్కూలు అసోసియేషన్ ప్రెసిడెంటు ఆర్.మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేటలో సురాజ్య ఉద్యమం



క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా స్వరాజ్యం ఉద్యమంలో భాగంగా స్థానిక లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గడియారస్థంభం సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి స్వరాజ్య ఉద్యమాన్ని ప్రారంభించారు. పార్టీ నియోజకవర్గ నాయకులు మాదాసు భాను ప్రసాదు సురాజ్యం మన జన్మహక్కని ప్రతిజ్ఞ చేయించారు.

డిసెంబర్ 9 వరకు అవినీతి వ్యతిరేక దినోత్సవంగా వివిధ రూపాలలో పోరాటం సాగుతుందన్నారు. కావున అన్ని ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు ఉద్యమంలో పాల్గొని జయప్రదం చేయాలని భానుప్రసాదు పిలుపునిచ్చారు. అనంతరం జాతీయ జెండాలతో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి మురికిపూడి ప్రసాద్, చంద్రమౌళి, శ్రీధర్, శ్రీనివాసరావు, సాధిక్, కమల్, మారం ప్రసాదు, కామినేని ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# జనహితం కోసం సురాజ్య ఉద్యమం

## గుంతకల్లు



అవినీతి రహిత సుపరిపాలన కోసం సురాజ్య ఉద్యమం కోసం లోక్‌సత్తా పార్టీ ఉద్యమాలు చేపట్టిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఓంకార్ పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీచౌక్ నుండే గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి లోక్‌సత్తా నాయకులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గాంధీచౌక్ నుంచి కొత్త బస్టాండ్ వరకూ అవినీతికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి ఓంకార్, మహిళా నాయకురాలు సరస్వతి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రామ్మోహన్, జిల్లా కార్యదర్శి వన్నూరప్ప, మండల నాయకుడు మహమ్మద్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిని బాగు చెయ్యండి




## చిలకలూరిపేట

స్థానిక 30 పడకల ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కరించాలంటూ లోక్‌సత్తా పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ సురేష్‌కుమార్‌ను కలిశారు. ఆసుపత్రిలో వైద్యపరికరాలు లేవని సంవత్సరం క్రితం ప్రారంభించిన రక్తనిధి కేంద్రం ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదని ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఆసుపత్రి అవరణలో పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటుచేసి 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసుపత్రికి స్వయంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ భానుప్రసాద్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జె.రామ్మూర్తి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లా వేణు, పద్మరాణి, దుర్గాదేవి చలమయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాయదుర్గంలో 'సురాజ్య ఉద్యమం'

సురాజ్య ఉద్యమ ప్రారంభాన్ని పురస్కరించుకుని రాయదుర్గంలో టవర్‌క్లాక్ వద్ద పార్టీ నాయకులు బి. బాబు, ఇతర కార్యకర్తలు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పట్టణ అధ్యక్షుడు అబ్దుల్లా, తిప్పేస్వామి, రియాజ్ పాల్గొన్నారు.

# నరసరావుపేటలో పార్టీసభ్యత్వ నమోదు

లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు పట్టణంలో ప్రారంభమైంది. పల్నాడు రోడ్డులోని పోలీసు సేవా కేంద్రం వద్ద సభ్యత్వ నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అవినీతికి అంతం, నీతికి పట్టం కట్టాలని కోరుకొని పౌరులు లోక్‌సత్తా పార్టీలో సభ్యులుగా చేరాలని పార్టీ జిల్లా నాయకులు జి. నాగేశ్వరరావు కోరారు. కొత్తతరానికి కొత్త రాజకీయం, మంచి రాజకీయానికి మంచి మనుషులు కావాలి అనే నినాదంతో సభ్యత్వ నమోదును నిర్వహిస్తున్నట్లు వివరించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులను మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సత్తా అధ్యక్షురాలు కె.లలితకుమారి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఈదర గోపిచంద్, ఆళ్ళ సుబ్బారెడ్డి, జి.నిర్మలాబోస్, స్వరాజ్య ఉద్యమ జిల్లా కమిటీ సభ్యుడు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సురాజ్యం కోసం యువత నడుం బిగించాలి

## చెన్నూర్

సురాజ్యం కోసం యువత నడుం బిగించాల్సిన అవసరం ఆసన్నమైందని లోక్‌సత్తా మహిళా విభాగం తూర్పు జిల్లా అధ్యక్షురాలు మేకల సరోజ అన్నారు. సురాజ్య ఉద్యమాన్ని స్థానిక న్యూలయోల పాఠశాలలో నిర్వహించారు. అనంతరం రిటైర్డ్ ఎస్టీవో కోరాళ్ల నారాయణరెడ్డి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో విద్యా, ఉద్యోగం, ఉపాధి పేరుతో పాలకులు ప్రజలను దోపిడీకి గురిచేస్తున్నారని ఆరోపించారు. చర్చావేదికలో విశ్రాంతా ఉపాధ్యాయులు మార్కాపురం వెంకయ్య, పుష్పాల లచ్చయ్య, సింగరేణి కార్మికుడు రాజారాం, బీజేపి నాయకులు కొండపాక చారి, టీఆర్ఎస్ నాయకులు చల్లా రాంరెడ్డి, కోటపల్లి జేఏసీ మండల కన్వీనర్ కామబాపు, యువసత్తా జిల్లా అధ్యక్షుడు బండారి శ్రీనివాస్, మహిళలు విద్యార్థులు పాల్గొన్నారు.




# ఓటుకు నోటు, మద్యం ఇచ్చే సంస్కృతి మారాలి

## మంచిర్యాల

అవినీతి మూలాలు రాజకీయాల్లో ఉంటున్నాయని, ఓటుకు నోటు, మద్యం ఇచ్చే సంస్కృతి సమాజంలో మారాలని సురాజ్య రాష్ట్ర ఉద్యమనేత బండారు రామ్మోహన్‌రావు అన్నారు. ఆగస్టు28న మంచిర్యాల పట్టణంలోని సితార ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సురాజ్య రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన ఓట్లతో ప్రభుత్వాలు ఏర్పాటు అవుతున్నాయని మనం కట్టే పన్నులతో ప్రభుత్వాన్ని నడుపుతున్న నాయకులు ప్రజలకు మాత్రం మంచి పాలనను అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షురాలు మేకల సరోజదేవి మాట్లాడుతూ ప్రజలు ఏ పనిచేసుకోవాలన్నా లంచాల కోరల్లో చిక్కుకొని అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పట్టణ సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. సమన్వయకర్తగా సరోజ, గౌరవాధ్యక్షుడిగా ఎంఎగఫార్, అధ్యక్షుడిగా కేవీ ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా రాజేశం, ఉపాధ్యక్షుడిగా అంజి, అసాది సుధాకర్, కోశాధికారిగా కుమార్, మధు, రావుల లక్ష్మణ్‌బాబు ఈ కమిటీని ఎన్నుకున్నారు.



# నరసరావుపేటలో సురాజ్య ఉద్యమం

మన స్వరాజ్యం కాల క్రమేణ దోపిడీదారుల అవినీతిపరుల స్వాహారాజ్యంగా మారిందని లోక్‌సత్తా పార్టీ పట్టణ అధ్యక్షులు ఈదర గోపిచంద్ ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని చేజర్ల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు సురాజ్య ఉద్యమ కరపత్రాలను పంపిణీ చేశారు. పాఠశాలలో వసతుల కోసం గతంలో రూ॥7వేలు విరాళం లోక్‌సత్తా పార్టీ ఇచ్చిందని, మరో రూ॥5 వేలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మొహిద్దీన్‌కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కె.లలిత కుమారి, ఆళ్ళ సుబ్బారెడ్డి, కె.ఆర్. ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యువతతోనే అవినీతి నిర్మూలన సాధ్యం



సమాజానికే చేటుగా పరిణమించిన అవినీతిని నిర్మూలించడం యువతరానికి సాధ్యమవుతుందని యువసత్తా రాష్ట్ర అధ్యక్షులు శివాజీరాజు పేర్కొన్నారు. మేడ్చల్ గడి మైసమ్మ ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు యువకులు యువసత్తాలో చేరారు. వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో చెడును రూపుమాపేందుకు యువత క్రియాశీలకపాత్ర పోషించాలని సూచించారు. అవినీతి వల్లనే అభివృద్ధి ఆగిపోయిందని, రోజురోజుకు వెలుగుచూస్తున్న లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలతో దేశ ఆర్థికస్థితి అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే యువతీ యువకులు యువసత్తా వేదికగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

**మేడ్చల్**

యువసత్తా ఆధ్వర్యంలో పార్టీ ఆశయాలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేసి లోక్‌సత్తా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, పృథ్వీ, కరుణాకర్, అజీత్‌సింగ్, శివకుమార్ పాల్గొన్నారు.

# సుపరిపాలన కోసం సురాజ్య ఉద్యమం

స్వరాజ్యం చాలదు – సురాజ్యం కావాలి అనే నినాదంతో అవినీతిరహిత సుపరిపాలన కోసం, ప్రజలకు హక్కుగా ప్రభుత్వ సేవలందించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త సురాజ్య ఉద్యమం సిద్దిపేటలో ప్రారంభమైందని సురాజ్య ఉద్యమ రాష్ట్ర నేత బండారు రామ్మోహన్‌రావు అన్నారు. స్థానిక ఎన్‌జిఓ భవన్‌లో సురాజ్య ఉద్యమ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రారంభ ఉపన్యాసం చేశారు.

**సిద్ధిపేట**




అవినీతి మూలాలు రాజకీయాల్లో వున్నాయని ఓటుకు నోటు మద్యం పంచే ప్రజాప్రతినిధులు చేసే అవినీతి ప్రజలందరి మీద ప్రభావం చూపిస్తున్నాయని రామ్మోహన్ రావు అన్నారు. అవినీతి అంతం కావాలంటే ఎన్నికల సంస్కరణలు, రాజకీయ సంస్కరణలు, చట్టబద్ధంగా ప్రజలకు సేవలందించే ఏర్పాటు చేయలన్నారు. ఈ సమావేశంలో జిల్లా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ అధ్యక్షులు కొర్తివాడ రాజేందర్, ఎ.లక్ష్మీనారాయణ, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాస్‌తో పాటు ఎన్‌జిఓ భవన్ అధ్యక్షులు చక్రపాణి, రచయితలు చొప్పదండి సుధాకర్, అమ్మన రామచంద్రారెడ్డి, అయిత చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీపేట సంఘటన పై నివేదిక

- హన్మంతరావు పార్నంది

**నేపథ్యం :**



15 సంవత్సరాల ముందు లక్ష్మీపేట గ్రామస్తులకు చెందిన 250 ఎకరాల్లో వారు పంట పండించుకునేవారు. ఈ గ్రామంలో రెండు కులాలు – తూర్పు కాపు (120 కుటుంబాలు), హరిజనులు (80 కుటుంబాలు) ఉన్నప్పటికీ, 250 ఎకరాలు మొత్తం తూర్పు కాపు వారి పేరున ఉండేవి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాగావళి నదిపై వంగర మండలంలో ఉన్న మడ్డువలస రిజర్వాయరు సామర్థ్యం 15 సంవత్సరాల క్రితం పెంచ తలపెట్టినప్పుడు లక్ష్మీపేట గ్రామము మరియు వారు సాగుచేసుకుంటున్న 250 ఎకరాలు సేకరించారు. దీనికి సంబంధించిన నష్టపరిహారాన్ని నిర్వాసిత కుటుంబాలకు ఇచ్చి వారిని ఇప్పుడు నివసిస్తున్న ప్రాంతానికి తరలించారు.

ప్రాజెక్టులో పూర్తిగా నీరు నిండితే తప్ప ఈ ప్రాంతానికి నీరు రాకపోవడం వలన లక్ష్మీపేట గ్రామస్తులలో తూర్పు కాపు వారు 190 ఎకరాల్లో సాగుచేయడం కొనసాగించారు. అయితే మిగతా 60 ఎకరాలు యజమానులు నష్టపరిహారం తీసుకొని వేరే ప్రాంతాలకు వెళ్ళిపోవడంతో, మరికొందరు నిర్వంశీయులు అయినందున, ఎస్సీలకు సాగు చేయుటకు సొంత భూమి లేకపోవడంతో ఈ 60 ఎకరాలు సాగుచేయడం 10 సంవత్సరాల క్రితం మొదలుపెట్టారు. ఎస్సీ వర్గం వారు ఈ భూమిని సాగు చేయడానికి వీల్లేదని, అలా చేయాలంటే, 60 ఎకరాలు కొనుగోలు చేయాలని, తూర్పు కాపు వర్గం వారు తెలియచెప్పారు. మాకు సొంత భూమి లేకపోవడం వలన, ఈ భూమిని మేం సాగు చేసుకుంటామని, అది మీది కానప్పుడు పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదని ఎస్సీ వర్గంవారే స్పష్టం చేశారు. అప్పటి నుండి ఈ రెండు వర్గాల మధ్య తగాదాలు మొదలయ్యాయి. గత సంవత్సరం గొడవ తీవ్రరూపం దాల్చి, తూర్పు కాపు వర్గం వారు హరిజనులను కులం పేరుతో దూషించడం, వారు సాగు చేసుకున్న భూమిని ట్రాక్టర్లతో దున్ని నాశనం చేయడం, అలా ఈ గొడవలు పోలీసులకు ఫిర్యాదు వెళ్ళినా, పోలీసు అలసత్వ వైఖరి వలన సద్దుమణగలేదు. దీంతో ప్రభుత్వ అధికారులు 250 ఎకరాలను సీజ్ చేసి, ఇరువర్గాలు సాగు చేయడానికి వీల్లేకుండా 107 బైండోవర్ కేసు నమోదు చేసింది. ఈ కసితో తూర్పు కాపు వర్గం వారు జూన్ 12, 2012వ తేదీనాడు హరిజనులపై దాడి చేశారు.

**జూన్ 12న ఏం జరిగింది**

ఏప్రిల్ మాసం, 2012లో కులం పేరుతో దూషించినందున, ఎస్సీ వర్గంవారు అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయగా, ఈ ప్రాంతాన్ని 'అట్రాసిటీస్ ప్రోన్ ఏరియా' గా గుర్తించి పోలీసు పికెటింగ్ ఏర్పాట్లు చేశారు. కాని 12వ తేదీన ఉప ఎన్నికలు జరుగుతున్నందున ఈ పికెటింగ్ ఎత్తివేయడంతో, ఇదే అదునుగా, తూర్పు కాపు వర్గం వారు ఎస్సీలపై ఉదయం 7.00 గంటల ప్రాంతంలో వందమంది

మూకుమ్మడిగా కట్టెలతో, కొడవళ్లతో, బండరాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో 5 మంది ప్రాణాలు కోల్పోగా, 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. నిద్రించిన వారిని లేపి, తినేవారిని, పనికి వెళ్ళేవారిని ఇంట్లోంచి లాక్కుని బయటకు ఈడ్చి గాయపరిచి, కసి తీరక మళ్లీ వచ్చి గాయపడిన వారిని చంపి, మానవ జాతికే అవమానకరంగా, అతి హీనంగా, క్రూరంగా ఒక వర్గం వారు హరిజన వాడపై స్వైరవిహారం చేశారు. ఈ ఉదంతంలో ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, దాడిలో మహిళలు కూడా పరోక్షంగా పాల్గొన్నారు. తమ భర్తలు, అన్నలు, తమ్ముళ్లు దాడి చేసి, చంపి అలసిపోతే వారికి త్రాగడానికి మంచినీళ్లు అందించి ప్రోత్సహించారు.

## చేపట్టిన చర్యలు

★ దాడికి సంబంధించి 86 మందిని నిందితులుగా గుర్తించి, 76 మందిని అరెస్టు చేశారు.

★ నష్ట పరిహారంగా చనిపోయిన కుటుంబానికి 5 లక్షలు ప్రకటించగా, 3.5 లక్షలు విడుదల చేసి వారి పేరుపై 'ఫిక్సడ్ డిపాజిట్' చేశారు. అలాగే ప్రతీ చనిపోయిన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కేటాయించారు. గాయపడిన వారికి 1.2 లక్షలు ప్రకటించారు.

★ 50 మంది పోలీసులతో పికెటింగ్ క్యాంప్ ఏర్పాటు చేశారు.

## ప్రమాదానికి గల కారణాలు - నిందితులెవరు?

1. ఈ ఘటనకు మొదటి కారణం ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యం – ఒకటి రెవెన్యూ శాఖ, రెండు ఇరిగేషన్, మూడు పోలీసులు. 250 ఎకరాల ప్రభుత్వ స్థలంలో సాగు చేసుకుంటున్న ఈ రెండు వర్గాల మధ్య ఘర్షణలు మొదలైనప్పుడు రెవెన్యూ మరియు ఇరిగేషన్ శాఖలు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చేపట్టకుండా కాలయాపన చేసింది. ఘర్షణలు మొదలై కులదూషణ స్థాయికి చేరినప్పుడు కూడా పోలీసు యంత్రాంగం తీవ్రంగా స్పందించి నిందితులపై కేసు నమోదు చేయకపోవడంతో, చట్టం అంటే భయం లేకుండా పోయింది. ఈ విషయం స్వయంగా బి.సి వర్గం వారు, మాపై కేసులు పెట్టినా మీరేం చేసుకోలేరని బెదిరించడం గమనార్హం.

2. బి.సి వర్గానికి చెందిన వారికి 250 ఎకరాలు ఉండటం, ఎస్సీ వర్గానికి చెందిన వారికి ఒక్క ఎకరా కూడా లేకపోవడం గమనార్హం. వీరు కౌలు రైతులగానో రోజు కూలీలుగానో కొనసాగటం తీవ్ర అసంతృప్తి, అసహనానికి గురి చేసినట్టు వారిలో ఉన్న ఆవేదన స్పష్టం చేస్తుంది. 15 సంవత్సరాల క్రితం మడ్డువలస రిజర్వాయరు సామర్థ్యం పెంచినప్పుడు, ఎస్సీలకు భూమి లేదని గుర్తించి, వారికి సాగు చేసుకోవడానికి భూమిని కేటాయించవలసినది.

## ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు

1. ప్రభుత్వం సత్వరం చేపట్టాల్సిన చర్యల్లో మొదటిది, బాధిత కుటుంబాల్లో ఆ గ్రామంలోని ప్రజలకు మనోధైర్యం నింపడం. వీరికి నష్టపరిహారంగా డబ్బులు, ఉద్యోగాలు ప్రకటించినా, మేము సురక్షితంగా ఉన్నామన్న నమ్మకం కలిగించడం, చట్టపరంగా వారికున్న హక్కుల గురించి తెలియచెప్పడం, వారిపై దాడి చేసిన వారి పై కఠినంగా వ్యవహరించి శిక్ష పడేలా ఏర్పాట్లు చేసే ప్రయత్నంలో ప్రభుత్వం ఉందన్న సంకేతం వారికి తెలియచెప్పాలి. అలా జరగాలంటే దోషులకు 90 రోజుల్లో శిక్షపడేలా హైకోర్టు పర్యవేక్షణలో ఒక ప్రత్యేక బెంచిని ఏర్పాటు చేయాలి. తద్వారా చట్టాలపై, ఈ వ్యవస్థపై వారికి నమ్మకం కుదురుతుంది.

2. లక్ష్మీపేట గ్రామానికి మౌలిక వసతులు – మంచినీరు, విద్య, వైద్య సదుపాయలు, మరుగుదొడ్ల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం కల్పించే ఏర్పాటు చేయాలి.

3. ముందు చెప్పినట్టుగా ఎస్సీ వర్గానికి చెందిన వారికి సాగు చేసుకోవడానికి సొంత భూమి లేకపోవడం అనేది ఈ సంఘటనకు మూల కారణమని చెప్పవచ్చు. ఈ పరిస్థితి ఒక్క లక్ష్మీపేట గ్రామానికో, శ్రీకాకుళం జిల్లాకో, పరిమితం కాదు. దేశమంతటా ఇదే పరిస్థితి. ప్రణాళికా సంఘం లెక్కల ప్రకారం 16% ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే సొంత భూమిలో సాగు చేసుకొనే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ వర్గాలకు భూ పంపిణీ ఒక విధానంగా ప్రకటించి, అది కూడా పట్టాలు కాకుండా, శాశ్వతంగా వారిని నిజమైన యజమానులుగా గుర్తించి భూ పంపిణీ చేయాలి.

పై చర్యలు చేపడితే ఈ వర్గాలకు ఆర్థిక – సామాజిక పరిస్థితి మెరుగుపడి, వీరిని ఆత్మగౌరవంతో ఈ సమాజంలో మెలిగే అవకాశం ఉంటుంది. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉంటుంది. ■

# రాష్ట్రంలో కుటుంబాలు, వసతులు

## (2011 జాతీయ సెన్సెస్ ఆధారంగా)

**1. రాష్ట్రంలో మొత్తం కుటుంబాలు :** 2,10,24,534

| | | |
|---|---|---|
| గ్రామీణ కుటుంబాలు | : | 1,42,46,309 |
| పట్టణాలలోని కుటుంబాలు | : | 67,78,225 |

**2. కుటుంబాల ఇళ్ల పరిస్థితి**

| | | | |
|---|---|---|---|
| మంచి ఇళ్లు | : | 1,46,61,416 | (69.7%) |
| నివాసయోగ్యమైనవి | : | 56,27,525 | (26.8%) |
| శిధిలావస్థలో వున్న | : | 7,35,593 | (3.5%) |
| **మొత్తం కుటుంబాలు** | : | **2,10,24,534** | |

**3. మొత్తం కుటుంబాలు** : 2,10,24,534

| | | |
|---|---|---|
| 1-2 సభ్యుల కుటుంబాలు | : | 39,22,867 |
| 3-4 సభ్యులు గల కుటుంబాలు | : | 1,01,25,458 |
| 5 మంది సభ్యుల కుటుంబాలు | : | 37,61,358 |
| 6-8 మంది కుటుంబాలు | : | 28,62,769 |
| 9 పై బడిన కుటుంబాలు | : | 3,52,082 |

**4. మంచినీటి వసతి - కుటుంబాలు**

| | | | |
|---|---|---|---|
| శుద్ధి చేసిన కుళాయినీరు | : | 1,02,98,089 | (49%) |
| శుద్ధి చేయని కుళాయినీరు | : | 43,93,481 | (20.9%) |
| నూతినీరు | : | 13,35,457 | (6.4%) |
| చేతిపంపుల నీరు | : | 28,85,510 | (13.7%) |
| బోరు నీళ్లు | : | 14,51,570 | (6.9%) |
| చెరువులు, కాలువలు వగైరా | : | 5,60,427 | (3.2%) |
| **మొత్తం కుటుంబాలు** | : | **2,10,24,534** | |

**5. కుటుంబాలు - దీపాలు**

| | | | |
|---|---|---|---|
| విద్యుత్ దీపాలు | : | 1,93,77,222 | (92.2%) |
| కిరోసిన్ | : | 14,50,876 | (6.9%) |
| ఇతరాలు (సోలార్, ఇతర తైలాలు) | : | 1,16,528 | (0.5%) |
| ఏ దీపం లేనివారు | : | 79,908 | (0.4%) |
| **మొత్తం కుటుంబాలు** | : | **2,10,24,534** | |

**6. కుటుంబాలు - మరుగుదొడ్లు**

| | | | |
|---|---|---|---|
| ఇంటి ఆవరణలోవున్న కుటుంబాలు | : | 1,04,24,003 | (49.6%) |
| పబ్లిక్ మరుగుదొడ్లు | : | 5,15,370 | (2.5%) |
| బహిరంగ మలవిసర్జన | : | 1,00,85,161 | (48.%) |
| **మొత్తం కుటుంబాలు** | : | **2,10,24,534** | |

**7. కుటుంబాలు - మురుగునీరు**

| | | | |
|---|---|---|---|
| భూమిలోపల డ్రయినేజీ వున్న | : | 45,31,727 | (21.6%) |
| బహిరంగమైన డ్రైయినులు | : | 74,32,297 | (35.4%) |
| ఏ డ్రయినేజీ వసతిలేని | : | 90,60,510 | (43.1%) |
| **మొత్తం కుటుంబాలు** | : | **2,10,24,534** | |

**8. కుటుంబాలు - వంట చెరుకు**

| | | | |
|---|---|---|---|
| కట్టెలు | : | 1,19,50,542 | (56.8%) |
| కిరోసిన్ | : | 8,09,437 | (3.9%) |
| గ్యాస్ సిలిండర్లు | : | 75,25,445 | (35.8%) |
| బయోగ్యాస్ | : | 1,49,059 | (0.7%) |
| ఇతరత్రా | : | 5,90,051 | (2.8%) |
| **మొత్తం కుటుంబాలు** | : | **2,10,24,534** | |

**9. కుటుంబాలు - వినియోగవస్తువులు**

| | | | |
|---|---|---|---|
| ఎ) రేడియోలున్న కుటుంబాలు | : | 19,49,681 | (9.3%) |
| బి) టెలివిజన్ వున్న కుటుంబాలు | : | 1,23,58,093 | (58.8%) |
| సి) టెలిఫోన్, మొబైల్‌ఫోన్లు | : | 1,32,62,317 | (63.1%) |
| డి) సైకిళ్లు వున్న కుటుంబాలు | : | 67,54,231 | (32.1%) |
| ఇ) స్కూటర్లు, మోటార్ సైకిళ్లు | : | 39,14,068 | (18.6%) |
| ఎఫ్) కార్లు, జీపులు, వ్యానులు | : | 5,62,769 | (2.7%) |
| జి) ఇలాంటి వస్తువులు లేని | : | 40,84,288 | (19.4%) |
| హెచ్)ఇంటర్‌నెట్ గల కంప్యూటర్లు | : | 5,49,284 | (2.6%) |
| ఐ) ఇంటర్‌నెట్ లేకుండా | : | 12,14,271 | (5.8%) |
| **మొత్తం కుటుంబాలు** | : | **2,10,24,534** | |

**(ఇక్కడ వివిధ వస్తువులు ఒకే కుటుంబంలో కూడా వుండడం వల్ల అంకెలు అదనంగా వుంటాయి.)**



హైదరాబాద్‌లో శేరిలింగంపల్లి రౌండ్ టేబుల్ సమావేశం



తూర్పుగోదావరిలో రౌండ్ టేబుల్ సమావేశం



అదిలాబాద్ (తూర్పు) రౌండ్‌టేబుల్ సమావేశం



శ్రీకాకుళంలో రౌండ్ టేబుల్ సమావేశం



రామచంద్రపురంలో రౌండ్‌టేబుల్ సమావేశం



మెదక్‌లో సురాజ్య ఉద్యమం



విశాఖపట్నంలో స్వాతంత్ర్య దినోత్సవం




నరసరావుపేటలో సభ్యత్వ నమోదు

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12







To,

**Book-Post**

PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad